


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 22.08.2025 | సంపుటి : 2 | సంచిక :200 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 22.08.2025 | volume : 2 | Issue : 200 | Pages : 8 | Cost : 2/- |

## విలేకరులు కావలెను


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




ఆ సమాచారం గగన్‌యాన్‌కు
### ఎంతో ఉపయోగం
శుభాంశు శుక్లా 04


06

భారత్ స్నేహాన్ని కోల్పోవడం..
### అమెరికా వైఫల్యం
ఐక్యరాజ్యసమితి యూఎస్ మాజీ రాయబారి నిక్కీ హేలీ

## మరిన్ని కుట్రలు చేస్తున్నారు

- కుట్రదారులే వేధింపులకు గురి చేస్తే ఎలా
- సింగరేణి కార్మికులకు కవిత బహిరంగ లేఖ



సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీ-వీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారని కవిత తెలిపారు. 03

## రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కాంగ్రెస్‌పై కావాలనే విష ప్రచారం : మంత్రి తుమ్మల



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని, యూరియా విషయంలో కావాలనే బీఆర్ఎస్, బీజేపీ విష ప్రచారం చేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా సరఫరాపై బీజేపీ అసత్య ప్రచారం మానుకోవాలన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావుకు పలుకుబడి ఉంటే కేంద్రం నుంచి యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు. 03



## ఫ్రస్టేషన్‌లో కేటీఆర్ పిచ్చి మాటలు

- ఇంట్లో పంచాయితీని బయట చూపిస్తున్నారు 03
- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రులు సీతక్క, పొన్నం ఫైర్

మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. ఇంట్లో జరిగే పంచాయితీ వల్ల ఆయన ఫ్రస్టేషన్‌ను బయట చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. థర్డ్ గ్రేడ్ ప్రభుత్వం అంటే ఏంటో కేటీఆర్ చెప్పాలన్నారు.

# కాళేశ్వరంపై వాడీవేడిగా వాదనలు

- విచారించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్
- ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు..?
- చర్యలు ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నలు
- స్పష్టత ఇస్తేనే కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్‌లపై ముందుకెళ్లగలం
- ప్రభుత్వానికి సూచించిన హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా



హైదరాబాద్, ఆగస్టు 21 :
మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై వేసిన పిటిషన్లపై తెలం గాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. రెండు పిటిషన్లను కలిపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది. ఐదు అంశాలను 'ప్రేయర్‌గా' పిటిషనర్లు పేర్కొన్నారు. కేసీఆర్ తరఫున వాదనలను సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వినిపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను రద్దు చేయాలని, అలాగే కమిషన్ నియమిస్తూ గత ఏడాది జారీ చేసిన జీఓను కొట్టివేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. 02



## నిగ్రహం కోల్పోతున్న నేతలు

### విమర్శల్లో బజారు భాష తగదు

హైదరాబాద్, ఆగస్ట్ 21 :
రాజకీయాల్లో విమర్శలు సహజమే. కానీ దానికోసం ఉపయోగిస్తున్న భాషే జుగుప్స కలిగిస్తోంది. నేతలు హుందాగా మాట్లాడాలి. హుందాగా వ్యవహరించాలి. మాటతీరు మనిషి హుందాతనం పెంచుతుంది. అవతలి వ్యక్తిపై ఎంతటి కసి ఉన్నా, వ్యతిరేకత ఉన్నా భాషతో జాగ్రత్తా ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. 04



భారత్‌లో మరింత
### విస్తరించండి
రష్యా కంపెనీలకు జైశంకర్ ఆహ్వానం 04



అదుపులోకి రాని
### బంగారం ధరలు
యథావిధిగా ధరల దోబూచులాట 04

## రేవంత్ దరిద్రపు పాలనకు అసమర్థ ఆస్కార్ అవార్డు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 21 :
అన్నదాతను అప్పుల పాల్జేసిన పాలకులను చూశాం కానీ, ఇప్పుడు వారిని చెప్పుల పాల్జేసిన చెత్త రికార్డు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయన దరిద్రపు గొట్టు పాలనకు అసమర్థ ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. యూరియా బస్తా కోసం చెప్పుల లైన్ వద్ద పడుకున్న ఫొటోను ఎక్స్ వేదికగా గురువారం పోస్టు చేసిన కేటీఆర్.. 'దీన్ని ఫ్రేమ్ కట్టించుకుంటావో.. మెడలో వేసుకుని ఊరేగుతావో నీఇష్టం' అని ఎద్దేవా చేశారు. 'బస్తా యూరియా కోసం రైతు బతుకును బజారున పడేశావ్. అందరి కడుపునింపే అన్నదాతను పాదరక్షల పాల్జేసిన పాపం ఊరికే పోదు' అని సీఎంను ఉద్దేశించి కేటీఆర్ హెచ్చరించారు. మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలసొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మూసీ అభివృద్ధికి రూ.16 వేలకోట్లతో మాస్టర్‌ప్లాన్ తయారుచ్తేస్త, కాంగ్రెస్ ప్రభుత్వం దాని అంచనాలను రూ.1.50లక్షల కోట్లకు పెంచి భారీ దోపిడీకి తెర లేపిందన్నారు. ఈ ప్రజాధనం దోపిడీని ముమ్మాటికీ ఎండగట్టి, ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.





## మాదాపూర్‌లో ఆక్రమిత స్థలంలో కట్టడాలు

- ఫిర్యాదుతో స్పందించి కూల్చివేసిన హైడ్రా
- సుమారు 400 కోట్ల విలువ భూమికి ముక్తి 03

## మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో 'ఇజ్రాయెల్' ఆందోళనలు

### 18 మంది అరెస్టు



గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పాల్పడుతున్న దారుణాలపై మైక్రోసాఫ్ట్‌లోని కొందరు ఉద్యోగులు ఇటీవల తమ నిరసన గళం వినిపించిన విషయం తెలిసిందే. కంపెనీ రూపొందించిన టెక్నాలజీని ఉపయోగించి ఇజ్రాయెల్ సైన్యం దారుణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో వాషింగ్టన్ రెడ్‌మండ్‌లోని మైక్రోసాఫ్ట్ కార్యాలయ ప్రాంగణంలో 35 మందితో కూడిన ఓ బృందం గత రెండు రోజులుగా ఆందోళనకు దిగింది. కంపెనీ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు 18 మందిని అరెస్టు చేశారు. 06

# కాళేశ్వరంపై వాడీవేడిగా వాదనలు

- విచారించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్
- ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు..?
- చర్యలు ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నలు



**హైదరాబాద్, ఆగస్టు 21 :** మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై వేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. రెండు పిటిషన్లను కలిపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది. ఐదు అంశాలను 'ప్రేయర్‌గా' పిటిషనర్లు పేర్కొన్నారు. కేసీఆర్ తరఫున వాదనలను సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వినిపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను రద్దు చేయాలని, అలాగే కమిషన్ నియమిస్తూ గత ఏడాది జారీ చేసిన జీఓను కొట్టివేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. కమిషన్ నివేదికను తమకు అందించలేదని పేర్కొన్నారు. కమిషన్ విచారణ సమయంలో యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వలేదని పిటిషన్లో సుందరం తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పిటిషన్లో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే బీఆర్ఎస్ పార్టీని అపప్రతిష్టకు గురిచేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. రాజకీయ వ్యూహంతోనే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని తెలిపారు. దురదృష్టవశాత్తు వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్‌లో ఒక పిలర్ కుంగిందని, వర్షాకాలంలో వచ్చిన అకాల వర్షాలే కారణమని పేర్కొన్నారు. కుంగిపోవడానికి డిజైనింగ్ లేదా ఇంజనీరింగ్ లోపాలు కారణం కాదని పిటిషనర్ల తరఫు న్యాయవాది స్పష్టం చేశారు.

## నివేదికను కేసీఆర్, హరీష్‌రావుకు అందించలేదు

నివేదిక కాపీలను తమకు అందించకుండా, మీడియాకు అందజేయడంలో దురుద్దేశం ఉందని వాదించారు. సాధారణ ప్రజల్లో తమ పరువును అపహాస్యం చేయాలన్న ఉద్దేశమే ఇందుకేనని చెప్పారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని, నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదని న్యాయవాది సుందరం పేర్కొన్నారు. నివేదికను కేసీఆర్, హరీష్‌రావుకు అందించలేదని కూడా వెల్లడించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ఇచ్చిందని సుందరం తెలిపారు. రాజకీయంగా నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని పేర్కొన్నారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. పిటిషనర్లు కేసీఆర్, హరీష్‌రావు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని ఏజీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు ముందే బయట పెట్టారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి జర్నలిస్టుకు 60 పేజీల నివేదికను అందజేశారని సుందరం తెలిపారు. కోర్టుకు సమర్పించిన నివేదిక కాపీలు స్పష్టంగా కనిపించడం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. కాపీలు స్పష్టంగా ఇవ్వగలిగితే తదుపరి విచారణ చేస్తామని తెలిపింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఇదే రోజున విచారణ కొనసాగించాలని కేసీఆర్ తరఫు న్యాయవాది సుందరం కోరారు.

## హైకోర్టు వేసిన మూడు ముఖ్యమైన ప్రశ్నలు.

జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అధికారికంగా విడుదల చేశారా?
నివేదిక కాపీని పబ్లిక్ డొమైన్‌లో పెట్టారా?
పిటిషనర్లకు సెక్షన్ 8బీ కింద నోటీసులు ఇచ్చారా లేదా?
కమిషన్ నివేదిక ప్రస్తుత స్థితి ఏమిటి?

తాము ఇచ్చిన నోటీసులు 8బీ నోటీసులేనని ఏజీ తెలిపారు. సెక్షన్ స్పష్టంగా పేర్కొనలేదని చెప్పి, అది 8బీ కాదని ఎలా అనవచ్చని ప్రశ్నించారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. "కిరణ్ బేడీ కేసుకు, ఈ కేసుకు తేడాలు ఉన్నాయి," అని ఏజీ తెలిపారు. నివేదికను పబ్లిక్ డొమెన్‌లో ఉంచలేదని, అసెంబ్లీలో చర్చించిన తర్వాత మాత్రమే ఉంచుతామని స్పష్టం చేశారు. కౌంటర్‌లో మరిన్ని వివరాలు పొందుపరిస్తామని తెలిపారు. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని హైకోర్టును ఏజీ కోరారు. అసెంబ్లీలో నివేదికపై చర్చించిన తర్వాతే తదుపరి విచారణ జరగాలని సూచించారు. సెక్షన్ 8బీ కింద కాకుండా, ఏ సెక్షన్ కింద నోటీసులు ఇచ్చారో అనే విషయాన్ని హైకోర్టు మరోసారి ప్రశ్నించింది. కమిషన్ నివేదిక ప్రస్తుతం ఏ దశలో ఉందో కూడా అడిగింది. ప్రజాధనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కమిషన్‌ను ప్రభుత్వం వేసిందని ఏజీ తెలిపారు. కమిషన్ నివేదికను కేబినెట్ సులభంగా అర్థం చేసుకునేలా 60 పేజీలుగా రూపొందించామని తెలిపారు. ఈ ఆధారంగా కేబినెట్ నివేదికను ఆమోదించిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చించి, తదుపరి చర్యలు తీసుకునేలా కేబినెట్ నిర్ణయం తీసుకున్నదని వివరించారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఈ పిటిషన్లపై విచారణ జరపవద్దని ఏజీ సూచించారు. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరారు. సెక్షన్ 8బీ కింద నోటీసులు ఇవ్వలేదని పిటిషనర్లు పేర్కొనడం సరైనది కాదని ఏజీ అభిప్రాయపడ్డారు. తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

కమిషన్ నివేదికను ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు?
నివేదికపై చర్యలు తీసుకున్న తర్వాత పెడతారా?
లేదా ముందు పెడతారా? అనే ప్రశ్నలను హైకోర్టు మరోసారి వేసింది.
"రేపు లేదా సోమవారం సమాచారం ఇస్తాను," అని ఏజీ తెలిపారు.



# మేడారంలో 40కోట్లతో స్మృతివనం

## మంత్రులు సీతక్క, లక్ష్మణ్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 21 :** మేడారం గ్రామంలో దాదాపు రూ. 40 కోట్ల వ్యయంతో 29 ఎకరాల విస్తీర్ణంలో సమ్మక్క, సారలమ్మ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్టు- రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు తెలియ చేశారు. గురువారం సచివాలయంలో వారు మాట్లాడుతూ, వచ్చే జనవరి 28 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు గతంలో మరెప్పుడూ లేనివిధంగా రూ.150 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈసారి జాతరకు ముందస్తుగా నిధులు మంజూరు చేయడం వల్ల సకాలంలో జాతర పనులు పూర్తవుతాయని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ల వీరోచిత చరిత్ర వారి పోరాటాలు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మేడారం గ్రామంలో 29 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్టు- మంత్రి ధనసరి అనసూయ వెల్లడించారు. 13 వ శతాబ్దం నాటికి చెందిన మేడారం తల్లుల చరిత్ర, గిరిజన సంస్కృతిని తెలియ చేసే విధంగా ఈ స్మృతి వనం ఉంటుందని వివరించారు. మేడారంలో జంపన్న వాగు నుండి మేడారం గద్దెల వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు ను విస్తరించి డివైడర్లు ఏర్పాటు- చేస్తున్నట్టు- చెప్పారు. దీనితో పాటు- అమ్మవార్ల గద్దెల చుట్టూ విస్తరణ, అభివృద్ధి పనులను ఆదివాసీ పూజారులతో చర్చించి చేపట్టనున్నట్టు- తెలిపారు. గత జాతర ఏర్పాట్లకు రూ.110 కోట్లు- కేటాయించగా ఈసారి జరిగే జాతరకు రూ.150 కోట్లు- కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్ లు ధన్యవాదాలు తెలియ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మేడారం జాతరకు పనులను కల్పిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. పర్యాటకశాఖతో కలిసి జంపన్న వాగును అభివృద్ధి చేస్తామన్నారు. స్మృతి వనాన్ని 29 ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆదివాసీ పూజారులతో కలిసి స్మృతివనాన్ని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం, డిప్యూటీ- సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలుగు ప్రజల గొప్ప జాతర సమ్మక్క సారలమ్మ జాతర. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రభుత్వం రూ.150 కోట్లు- మంజూరు చేసిందని సీతక్క తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,200 కోట్ల వ్యయంతో లక్షా 15 వేల 089 పనులను చేపడుతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. దీనిలో 1630 అంగన్వాడీ భవనాలు, 3157 గ్రామపంచాయితీ భవనాలు, ఇంకుడు గుంతలు, టాయిలెట్లు- తదితర నిర్మాణాలను చేపడుతున్నట్టు- వివరించారు. ఈ పనులను ఆయా నియోజక వర్గాల్లో ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారని మంత్రి వివరించారు.

# ఉప ఎన్నిక వస్తే ఎదుర్కొంటా : తెల్లం

**భద్రాచలం, ఆగస్ట్ 21 :** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సిద్ధమైట్లు తెలుస్తుంది. సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయ సలహా తీసుకున్న స్పీకర్.. 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు- తెలుస్తుంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు- వేయాలని బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. జూలై 25వ తేదీన విచారణ చేసిన న్యాయస్థానం మూడు నెలల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కు సూచించింది. ఇక, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం మరోసారి చర్చనీయాంశం అయింది. తాజాగా, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇస్తారని అంశంపై చర్చ కొనసాగుతుండగా.. ఈ అంశంపై భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. తనకు ఎటువంటి నోటీసులు రాలేదన్నారు. భద్రాచలంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగానే ఉన్నాను.. అటువంటి పరిస్థితి వస్తుందని అనుకోవటం లేదని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎంతో అభివృద్ధి చేస్తున్నాను అని ఎమ్మెల్యే వెంకట్రావ్ పేర్కొన్నారు.

# నేడు బీహార్, బెంగాల్లో మోడీ పర్యటన

## రెండు రాష్ట్రాల్లో 18 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో శుక్రవారం పర్యటించనున్నారు. పర్యటన సందర్భంగా రెండు రాష్ట్రాల్లో 18 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించ నున్నారు. బీహార్‌లో 13 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను, పశ్చిమ బెంగాల్‌లో 5,200 కోట్ల రూపాయల ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. బీహార్ పర్యటన సందర్భంగా రెండు రైళ్లను ప్రారంభిస్తారు. గయ, ఢిల్లీల మధ్య తిరిగే అమ్రిత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును.. వైశాలి, కోధర్మల మధ్య తిరిగే బుద్ధిస్ట్ సర్క్యూట్ -ట్రైన్‌ను మోదీ ప్రారంభిస్తారు. అంతేకాకుండా ఎన్‌హెచ్ 31పై 8.15 కిలోమీటర్ల పొడవైన ఆంటా - సిమారియా బ్రిడ్జిని, గంగానదిపై 1.86 కిలోమీటర్ల ఆరు లైన్ల బ్రిడ్జిని కూడా ఆయన ప్రారంభిస్తారు. గంగానదిపై ఆరు లైన్ల బ్రిడ్జి కారణంగా మొకామా నుంచి బెగుసరాయ్‌కి డైరెక్ట్ కనెక్టివిటీ- ఏర్పడనుంది. ఈ బ్రిడ్జీల నిర్మాణం కోసం ప్రభుత్వం ఏకంగా 13వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు- బీహార్ ప్రభుత్వం చెబుతోంది.'ఈ బ్రిడ్జి కారణంగా ఆ ఏరియాల్లో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. ఉత్తర బీహార్ అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి వారు ముడి సరుకుల కోసం ఇతర అవసరాల కోసం జార్ఖండ్, దక్షిణ బీహార్ మీద ఎక్కువగా ఆధారపడుతున్నారు. వారికి చాలా మేలు జరుగుతుందని ఓ ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. ఇక, పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా నిర్మితమైన మెట్రో ట్రైన్ సర్వీసులను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 4.15 గంటలకు మెట్రో సర్వీసును ప్రారంభిస్తారు. అంతేకాదు.. జెస్సోర్ రోడ్ నుంచి జై హింద్ భీమన్బందర్ ఎయిర్ పోర్టు వరకు మెట్రో రైలులో ప్రయాణిస్తారు.



# లైంగిక వేధింపుల ఆరోపణల్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

**తిరువనంతపురం, ఆగస్టు 21 :** మలయాళం ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు మరోసారి కలకలం రేపాయి. ఓ యువ రాజకీయ నాయకుడు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ నట, మాజీ జర్నలిస్ట్ రిని ఆన్ జార్జ్ ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే, ఆ నాయకుడు ఎవరన్నది ఆమె క్లారిటీ ఇవ్వలేదు. బీజేపీ మాత్రం ఆ యువ రాజకీయ నాయకుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాహుల్ మమ్కూతతిల్‌గా తెలిపింది. ఈ ఆరోపణలతో రాహుల్ కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాపై ఎలాంటి ఒత్తిడీ లేదని, వ్యక్తిగత బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# తనపై మరిన్ని కుట్రలు చేస్తున్నారు

- కుట్రదారులే వేధింపులకు గురి చేస్తే ఎలా
- సింగరేణి కార్మికులకు కవిత బహిరంగ లేఖ



**హైదరాబాద్, ఆగస్ట్ 21 :** సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీ-వీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారని కవిత తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న కవిత ఈ మేరకు సింగరేణి బొగ్గు గని కార్మికులకు బహిరంగ లేఖ రాశారు. టీ-వీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు. రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగింది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకంట్ల కవితను ఆ పదవి నుంచి సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తొలగించారు. ఆమె స్థానంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్‌ను కేటీ-ఆర్ నియమించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో అన్నాచెల్లెళ్ల మధ్య పోరు మరింత తీవ్రంగా మారినట్లు- అయింది. అయితే కల్వకుంట్ల కవిత ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికులకు గురువారం ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. టీ-బీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా పదేళ్ల పాటు- మీకు సేవ చేసుకునే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పదేళ్ల కాలంలో టీ-బీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా ప్రతి కార్మిక కుటుంబంలో ఒక సోదరిగా మీకు సేవలందించాను. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పార్టీ ఆఫీస్‌లో ఈ ఎన్నిక నిర్వహించడం సాంకేతికంగా తప్పా ఒప్పా అనే అంశాలను పక్కన పెడితే రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగినట్టుగా తెలుస్తోన్నది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తాను పోరాడుతుంటే కొందరు తనపై కుట్రలు పన్నుతున్నారు. అలాంటి కుట్రలతో వ్యక్తిగతంగా తనకు వచ్చే నష్టం ఏమీ లేకపోయినా, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్న తనను తొలగించి వారి ఐక్యతను దెబ్బతీయడమే కొందరి లక్ష్యంగా కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చే పద్ధతిని పక్కన పెడితే గౌరవ కేసీఆర్ గారిని ఒప్పించి తిరిగి డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించేలా చేశాను. పార్టీ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగంపై వివిధ వర్గాల ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను తాను లేఖ రూపంలో తెలియజేశాను. తన తండ్రిగారైన కేసీఆర్ కి తాను గతంలోనూ ఇలాంటివి ఎన్నో లేఖలు రాశాను. తాను గతంలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు కేసీఆర్ గారికి రాసిన ఆ లేఖను లీక్ చేశారు. ఆ లేఖను లీక్ చేసి తనపై కుట్రలకు పాల్పడుతున్న వారు ఎవరో బయట పెట్టాలని తాను కోరాను. పార్టీలో జరుగుతోన్న వ్యవహారాలను తాను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా తనపై కక్షగట్టారు. ప్రతి కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా ఎల్లవేళలా నేను మీ వెన్నంటే ఉంటానని మాట ఇస్తున్నానని కవిత తన లేఖలో పేర్కొన్నారు.



# మేట్టూరుకు జలకళ

**చెన్నై, ఆగస్టు 21 :** డెల్టా జిల్లాలకు సాగుజలాలను, ప్రజలకు తాగునీటిని అందించే మేట్టూరు జలాశయం ఈ యేడాదిలో ఐదోసారి పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆ జలాశయం 16 క్రస్ట్‌గేట్లను తెరచి జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. నైరుతి రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా కర్ణాటకలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంలలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో ఆ డ్యాంల నుంచి విడుదలయ్యే అదనపు జలాలు మేట్టూరు జలాశయంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ డ్యాం నుంచి డెల్టా జిల్లాలకు సాగుజలాలను జూన్ 12న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విడుదల చేశారు. ఆ సమయంలో డ్యాంలో ముప్పావుశాతం మేరకు నీటి నిల్వలు ఉన్నాయి. ఆ తర్వాత జూన్ 29న తొలిసారిగా పూర్తి స్థాయిలో (120 అడుగులు) జలాలతో నిండింది. అటు పిమ్మట జూలై 5న రెండోసారి, జూలై 25న నాలుగోసారి పూర్తిస్థాయిలో నీటిమట్టం నమోదైంది. ఆ తర్వాత రెండువారాలపాటు నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం భారీగా వర్షాలు కురవడంతో పాటూ కర్ణాటకలోని జలాశయాలలో నీటిమట్టం విపరీతంగా పెరిగింది. దీంతో ఆ డ్యాంల నుంచి భారీ పరిమాణంలో అదనపు జలాలను విడుదల చేయడంతో మేట్టూరు డ్యాంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వచ్చింది. మంగళవారం ఈ డ్యాంలో నీటిమట్టం 117.45 అడుగులకు చేరింది. బుధవారం ఉదయం 8గంటలకు నీటిమట్టం 120 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలోకి 1,08,529 క్యూసెక్కుల జలాలు ప్రవేశిస్తున్నాయి. డ్యాం నుంచి 90 వేల క్యూసెక్కులను చొప్పున జలాలను దిగువకు వదులుతున్నారు. మేట్టూరు డ్యాం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో కావేరి నదిలో ఎవరూ స్నానం చేయకూడదని అధికారులు ఆంక్షలు విధించారు.

# కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

## : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం, ఆగస్టు 21 :** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం తిరుమలాయపాలెం మండలంలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని ఎక్కడ తగ్గనివ్వకుండా ప్రభుత్వం పని చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ.. ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేతలు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుభరోసా రూ.10 వేలు ఇస్తే.. తమ ప్రభుత్వం రూ.12 వేల చొప్పున 9 రోజుల్లో 9 వేల కోట్లు ఇచ్చిందని తెలిపారు. పేదలకు గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని, ఈ ప్రభుత్వం 7 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేసిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతామని పొంగులేటి స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో కోళ్ల ఫారాల్లో, రైస్ మిల్లుల్లో హాస్టల్స్ నిర్వహిస్తే.. ఈ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతును రాజు చేసే పనిలో.. కాంగ్రెస్ ప్రభుత్వం ముందుటుందని వివరించారు. ధరణిని ఎత్తివేసి, భూభారత్ చట్టాన్ని తీసుకువచ్చి రైతులకు మేలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేసే ప్రతి మంచి కార్యక్రమానికి ప్రజలే అండగా ఉన్నారని పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతక ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. యూరియాను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షలు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

# ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు పాస్

## రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :** ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు2025 ఎట్టకేలకు పార్లమెంట్‌లో పాసైంది. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. విపక్షాలు తీవ్ర ఆందోళన చేపడుతున్న నేపథ్యంలోనే బిల్లును పాస్ చేశారు. ఎటువంటి చర్చ లేకుండానే బిల్లుకు పచ్చజెండా ఊపారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్‌లో జరిగే అన్ని రకాల మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ ఈ బిల్లును రూపొందించారు. అయితే ఈ బిల్లు ద్వారా ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను మాత్రం ప్రమోట్ చేస్తున్నారు. విపక్ష సభ్యులు ఇచ్చిన సవరణలను తోసిపుచ్చుతూ.. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు బుధవారం లోక్‌సభలో క్లియరెన్స్ దక్కిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ మనీ గేమ్స్, బ్యార్ బ్యాంక్స్, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన వాణిజ్య ప్రకటనపై కూడా నిషేధం విధించారు. డబ్బులు డిపాజిట్ చేసి ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడే విషయం తెలిసిందే. గెలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో ఈ క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోంది.

# ఎరువుల సరఫరా బాధ్యత కేంద్రానిదే

- రైతులకు బండి సంజయ్సమాధానం చెప్పాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**కరీంనగర్, ఆగస్ట్ 21 :** తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యూరియా సరఫరా కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, కేంద్రం చుట్టూ తిరిగినా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇక్కడున్న కేంద్రమంత్రులు కూడా పట్టించుకోక పోవడం దుర్మార్గమని అన్నారు. రైతుల పట్ల వారికున్న నిబద్ధత ఇదేనా అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు. రైతులకు జవాబు చెప్పాల్సిన బాధ్యత బండి సంజయ్‌పై ఉందన్నారు. ఎరువుల విషయంలో రైతుల్లో భయాందోళనలు సృష్టించి భారత రాష్ట్ర సమతి నేతలు రాక్షసానందం పొందుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువుల్లో 60 శాతం మాత్రమే కేంద్రం నుంచి వచ్చింది. అందువల్లే కొంత ఇబ్బంది కలుగుతోంది. రాష్ట్రం నుంచి ఏదైనా సమస్య వస్తే బాధ్యత వహించడానికి మేం సిద్ధంగా ఉన్నాం అని పొన్నం ప్రభాకర్ అన్నారు..

# ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై కీలక నిర్ణయం

## అకౌంట్స్, ప్రమాణాల పరిశీలనకు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 21 :** ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు అందించే అకౌంట్స్‌తో పాటు- ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజీల్లో విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ ఎలా ఉన్నాయి అనే అంశాలపైనా దృష్టి సారించనుంది.

# మాదాపూర్‌లో ఆక్రమిత స్థలంలో కట్టడాలు

- ఫిర్యాదుతో స్పందించి కూల్చివేసిన హైడ్రా
- సుమారు 400 కోట్ల విలువ భూమికి ముక్తి



**హైదరాబాద్, ఆగస్ట్ 21 :** హైడ్రా దాడితో నగరంలో భారీ విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం నుండి బయటపడింది. ప్రజావాణజలో వచ్చిన ఫిర్యాదను ధృవకీరించి సకాలంలో స్పందించింది. దీంతో కోట్ల విఉలువైన ప్రభుత్వ భూమిని కాపాడగలిగారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు– రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా దాదాపు 8,500 గజాలుగా ఉన్న రెండు పార్కులు కబ్జాకు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు.. 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఇలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కబ్జా చెర నుంచి కాపాడింది. దీని విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుందని అంచనా. 1995లో అనుమతి పొందిన ఈ లేఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది. ఇదే అదనుగా ఈ లేఔట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహిందిరెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఔట్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధరించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు– సూచిస్తూ బోర్డులు కూడా పెట్టారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు– చేశారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీసు కేసులు పెడుతున్నట్టు– హైడ్రా అధికారులు తెలిపారు. హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లే వ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ.4 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దె వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ నోటీ సులు కూడా ఇచ్చిన విషయా న్ని గుర్తుచేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ యజమానులకు తెలియకుండా తర్వాత ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని.. మధ్యలో జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. దీంతో హైడ్రా గురువారం ఆక్రమణలను కూల్చివేసింది. అలాగే దీనిపై చర్యలకు కూడా ఉపక్రమించనుంది. హైడ్రా చర్యను లే ఔట్ యజమానులు అభినందించారు.





## ఫ్రస్టేషన్‌లో కేటీఆర్ పిచ్చి మాటలు

- ఇంట్లో పంచాయితీని బయట చూపిస్తున్నారు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రులు సీతక్క, పొన్నం ఫైర్

**బెల్లంపల్లి, ఆగస్టు 21 :** మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. ఇంట్లో జరిగే పంచాయితీ వల్ల ఆయన ప్రస్టేషన్‌ను బయట చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. థర్డ్ గ్రేడ్ ప్రభుత్వం అంటే ఏంటో కేటీఆర్ చెప్పాలన్నారు. థర్డ్ గ్రేడ్ అంటే కేటీఆర్ చేసిన అవినీతినా..? ఆయన అహంకారమా? అనేది చెప్పాలన్నారు. థర్డ్ గ్రేడ్ అంటే తమ ముఖ్యమంత్రినా? ప్రభుత్వమా? అంటూ కేటీఆర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ది డర్టీ మైండ్ అని.. ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్‌కు ఇంట్లో పంచాయితీ తట్టుకోలేక డైవర్ట్ చేయడం కోసం పిచ్చి పిచ్చి కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌ను సొంత చెల్లినే వ్యతిరేకిస్తోందని.. దాంతో ఆయన మైండ్ కరాబైందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్–బీజేపీ రాజకీయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. హెలికాప్టర్ వేసుకుని థర్డ్ ఫ్రంట్ అని తిరిగారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ దృష్టిలో ఫస్ట్ గ్రేడ్ అంటే ఏంటో? థర్డ్ గ్రేడ్ ఏంటో చెప్పాలన్నారు. కేటీఆర్ ముందు కవిత చేస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సమాధానం చెప్పాలని చురకలంటించారు. బీఆర్ఎస్ పార్టీ బండారం సెప్టెంబర్ 9న బయట పడుతుందన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ దోస్తానా ఉందో లేదో ఆ రోజు తేలిపోతుందని వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగు బిడ్డకు మద్దతుగా నిలబడతావా? లేదా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణం అని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ కృత్రిమ డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. యూరియా ఇచ్చేది రాష్ట్రమా? కేంద్రమా? కేటీఆర్ చెప్పాలన్నారు. యూరియా ఎవరిస్తారో వారికే మద్దతు అంటే అర్థం ఏంటి? అని కేటీఆర్‌ను వారు ప్రశ్నించారు.

## బెట్టింగ్ కోసం తండ్రిని హత్య చేసిన కొడుకు

**వనపర్తి, ఆగస్టు 21 :** కొందరు బెట్టింగ్‌కు అలవాటుపడి ఎంతటి దారుణాలకైనా తెగబడుతున్నారు. ఈక్రమంలో బెట్టింగ్ ఆడవద్దని చెప్పినందుకు తండ్రిని హత్యచేశాడు ఓ కొడుకు. వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాలోని ఘన్‌పూర్ మండలం కోతులకుంట తండాకు చెందిన కేతావత్ హనుమంతు(37)కు భార్య, ఇద్దరు కొడుకులు రవీందర్ (19), సంతోష్ ఉన్నారు. వీరు జీవనోపాధి కోసం గచ్చిబౌలిలోని ఎన్టీఆర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు. హనుమంతు మేస్త్రీగా పని చేస్తుండగా, పెద్ద కొడుకు రవీందర్ ఇంటర్ పూర్తి చేసి జులాయిలా తిరుగుతూ, బెట్టింగ్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. ఇటీవల అప్పులు పెరిగిపోవడం, కుమారుడి ఉన్నత విద్యకు డబ్బుల్లేక హనుమంతు సొంతూరులోని భూమి తాకట్టు పెట్టి రూ.6 లక్షలు తెచ్చాడు. ఈ డబ్బులపై కన్నేసిన రవీందర్ బ్యాంకులో వేస్తే భద్రంగా ఉంటుందని తన అకౌంట్‌లో రూ.2.5 లక్షలు జమ చేయించుకున్నాడు. ఈ డబ్బులను బెట్టింగ్ యాప్‌లో పెట్టి మొత్తం పోగొట్టుకున్నాడు. అకౌంట్‌లో ఉన్న డబ్బులు విత్ డ్రా చేద్దామని తండ్రి అడగ్గా స్నేహితుడికి ఇచ్చానని, త్వరలోనే ఇస్తాడని నమ్మించాడు. ఈ విషయంలో అలానే బెట్టింగ్ ఆపాలని తండ్రి హనుమంతు, కొడుకు మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తండ్రి డబ్బుల గురించి నిలదీయగా స్నేహితుడు ఇచ్చేందుకు వస్తున్నాడంటూ ఎన్టీఆర్ నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. తన స్నేహితుడు డబ్బులతో పాటు సర్‌ప్రైజ్ ఇస్తాడని చెప్పి తండ్రి కళ్లకు రవీందర్ గంతలు కట్టి మాటల్లో పెట్టి అప్పటికే తెచ్చుకున్న కత్తితో తండ్రి గొంతులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై తండ్రి అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు.

## దెబ్బతిన్న రోడ్ల నివేదికకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 21 :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల వల్ల ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని దెబ్బతిన్న రోడ్ల వివరాలపై నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. రోడ్ బ్రీచెస్ సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్ రోడ్స్, పంచాయితీ రోడ్స్,పలు కల్వర్టులు,మైనర్ బ్రిడ్జిల స్థితిగతుల వివరాలు అడిగిన మంత్రి వాటి లైఫ్ టైమ్ నమోదు చేయాలని సూచించారు. పూర్తి శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో కొత్తగా నిర్మించేందుకు ప్రపోజల్స్ తయారు చేయాలన్నారు. సుమారు 1000 కోట్ల వరకు ఆర్ అండ్ బి శాఖ రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో గురువారం నాడు ఆర్ అండ్ బి శాఖ పై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ఈఎన్సి జయ భారతి,సి.ఈ రాజేశ్వర్ రెడ్డి,ఎస్.ఈ ధర్మారెడ్డి పలువురు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు. అతి కొద్ది రోజుల్లోనే హ్యామ్ విధానం ద్వారా మెరుగైన,నాణ్యమైన రోడ్లు వేసుకోబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలో టెండర్ పక్రియ పూర్తి చేసుకొని, ఈ సీజన్ వర్షాలు తగ్గుముఖం పెట్టగానే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం పూర్తి ప్రణాళిక బద్దంగా



వెళ్తుందని చెప్పారు. కేంద్రం నుండి క్లియరెన్స్ రావాల్సిన కఐ ప్రాజెక్ట్స్ పై ఆరా తీసిన మంత్రి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తాను ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర పరిధిలోని ప్రాజెక్ట్స్ పై మాట్లాడానని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున విజ్ఞప్తులు కూడా ఇచ్చామని వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి గుర్తు చేశారు. ఖానాపూర్ నుండి బెల్లాం,ఉట్నూర్ నుండి గుడి అత్నూర్ రోడ్ మార్గం పై మంత్రికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి పై సానుకూలంగా స్పందించారు.

## కాంగ్రెస్ పార్టీలో విభేదాలు సాధారణం

**మంత్రి కొండా సురేఖ**



**హైదరాబాద్, ఆగస్టు 21 :** కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సర్వసాధారణమని పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సాధారణ వర్గ విభేదాలను ప్రతిపక్షలు తప్పుడు కోణంలో చూస్తూ.. తప్పడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏ పార్టీలో అయిన వర్గ విభేదాలు ఉంటాయని, సమయాన్ని బట్టి అవి బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం మాట్లాడారు. వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ ముంపునకు గురవుతుండడానికి నాలాల ఆక్రమణే కారణమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్‌ను ముంపు ప్రాంతాలు లేని నగరంగా మార్చుతామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం నివేదికతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలు బట్టబయలయ్యాయని మంత్రి సురేఖ విమర్శించారు. నివేదికలో మాజీ సీఎం కేసీఆరే.. ప్రధాన సూత్రధారిగా తేలిందని ఆరోపించారు. నివేదికలో నిజాలు బయటపడ్డ బీఆర్ఎస్ నేతలు ప్రజలకు కళ్ళబుల్లి మాటలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రజలకు విష ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు ఉన్న కేంద్రం నుంచి యూరియా తేలేకపోయారని విమర్శించారు. తెలంగాణలో మోదీ భజన చేయడంలో ఉన్న శ్రద్ధ వారికి రైతుల మీద లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు తమ వైపే ఉన్నారని కొండా సురేఖ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ ఉద్యమానికి భారీ స్పందన వస్తోందని తెలిపారు. దొంగ ఓట్లతోనే అన్ని రాష్ట్రాల్లో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీకి మొదటి నుంచి తెలంగాణ అంటే ఇష్టం లేదని.. అందుకోసమే రాష్ట్రానికి యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

**యూరియా కోసం రైతుల అగచాట్లు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

**నల్లగొండ, ఆగస్టు 21 :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానిలో భాగంగానే ఇప్పుడు యూరియా కష్టాలు అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు నిద్రాహారాలు మాని చెప్పులు పెట్టుకుని అవస్థలు పడుతున్నారని అన్నారు. నల్లగొండలోని బీఆరెస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉంది. కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. కెసిఆర్ వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారు. వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్లమని గుర్తు చేశారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ జరిగేది రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం. గతంలో ధాన్యం కొనుగోళ్లకు రైతులు ఇబ్బంది పడ్డారు. కరెంట్ కోసం ఇబ్బందులు మొదలయ్యాయి. యూరియా కొరత వెనక కొంతమంది మంత్రులు, అధికారులు ఉన్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోను కమీషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేసారు. గతంలో మేము వస్తే అన్ని తెస్తామన్నారు. ఢిల్లీకి 56 సార్లు వెళ్లిన సీఎం కనీసం ఎరువులు తేలేవా? అని ప్రశ్నించారు. పోలీసులతో పహారా, లాఠీఛార్జ్ లతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి కాళు



పట్టుకుని పదవులు తెచ్చుకునే కాంగ్రెస్ నేతలకు..రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చారని ధ్వజమెత్తారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. ఇద్దరూ మంత్రులు ఉండి కూడా జిల్లాపై కనీసం రివ్యూ చేయలేదన్నారు. మంత్రుల తీరుతో నల్లగొండ జిల్లా ప్రతి రంగంలో తిరోగమానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో సాగు నీళ్ల కోసం రైతులు రోడ్డు ఎక్కుతుంటే మంత్రులు సిగ్గు పడాలన్నారు. మంత్రికి చేత కాక అధికారులతో తప్పుడు పద్ధతుల్లో ప్రకటనలు చేయిస్తున్నారు. కొరత లేదని తప్పుడు ప్రకటనలు చేసే అధికారులు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. మంత్రుల బాధ్యతను మీరు నెత్తిన వేసుకుని ఇబ్బందులు పడొద్దని సూచించారు. అధికారుల ప్రకటన నిజం అయితే రైతులు ఇవ్వాళ కూడా ఎందుకు క్యూ లైన్ల లో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతులు ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే లు గదారి కిశోర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం అష్టకష్టాలు

**సొమ్మసిల్లిపడిపోయిన రైతు.. తలకు గాయాలు**

**మహబూబాబాద్, ఆగస్టు 21 :** రాష్ట్రంలో యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తెల్లవారుజామునే సహకార కేంద్రాలకు వద్దకు చేరుకుని పడిగాపులు కాస్తున్నారు. కాంగ్రెస్ అసమర్ధ పాలనలో అన్నదాతలు అరిగోస పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు సాగును పండుగలా చేసిన రైతులు కాంగ్రెస్ ఏలుబడిలో ఒక్క యూరియా బస్తా కోసం రక్తం చిందించాల్సిన దుస్థితి నేడు రాష్ట్రంలో నెలకొంది. సాగు నీళ్లు ఇవ్వరు, కరెంట్ సరఫరా చేయరు, కనీసం ఎరువులు, పురుగు మందులు కూడా అందించడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైం దని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా బస్తాల కోసం రైతులు యుద్ధం చేయాల్సిన దారుణ పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొన్నాయి. తాజాగా మహబూబాబాద జిల్లా మరిపెడ మండలం మల్లమ్మ కుంట తండాకు చెందిన అజ్మీరా లక్క, విజయ అనే దంపతులకు 20 రోజులైనా యూరియా దొరకడం లేదని ఇవాళ ఇస్తున్నారని తెలిసి భార్య భర్తలు వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. అయితే లక్కకు గతంలో పక్షపాతం వచ్చి ఇబ్బంది పడుతున్నాడు. అదే బాధలో యూరియా కోసం గురువారం రాగా లైన్‌లో నిలబడి ఒక్కసారిగా సొమ్మసిల్లి మెట్ల పైనుంచి కింద పడడంతో తల పగిలి తీవ్రగాయమైంది. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది లక్కను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల కష్టాలను చూసి సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

## జాతీయ రహదారిపై ఎమ్మెల్యే అనుచరుల హల్‌చల్

**బెల్లంపల్లి, ఆగస్టు 21 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని కెమికల్ ఏరియా జాతీయ రహదారిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏలు, క్యాడర్ హల్‌చల్ చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తూ డ్యాన్సులు చేస్తూ, చిందులు వేస్తూ కేరింతలు కొట్టారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రభుత్వ పీఏ రామకృష్ణ, డ్రైవర్ మోసిన్, శేఖర్, పీఏ గడ్డం ప్రసాద్, రామకృష్ణ, ఎమ్మెల్యే సన్నిహితుడు రమేష్, యూత్ నాయకుడు శ్యామ్ రోడ్డుపై చిందులు వేశారు. అటువైపుగా వెళ్తున్న వాహన చోదకులు, ప్రజలు భయబ్రాంతులకు గురై ఇబ్బందులు పడ్డారు. నడిరోడ్డుపై మద్యం సేవిస్తూ డ్యాన్సులు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో చిందులు వేసిన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జల్సాలు చేసుకోవాలి కానీ ఇలా బహిరంగంగా చిందులు వేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అధికారులపై దాడి చేస్తే ఉపేక్షించొద్దు

**ఏపీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే రాజాసింగ్**



**హైదరాబాద్, ఆగస్టు 21 :** అధికారులపై దాడి చేసింది ఎవరైనా ఉపేక్షించ వద్దని, కఠిన చర్యలు తీసుకోలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులపై దాడి చేసిన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారని.. ఈ విషయం చాలా మంచిదేనని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులపైన దాడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయనే మంచి సందేశాన్ని పవన్ కల్యాణ్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని కాపాడే బాధ్యత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైన కూడా ఉంటుందని సూచించారు. శ్రీశైలం జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడానికి యావత్ భారతదేశం నుంచి భక్తులు చాలామంది వస్తారని.. కానీ దురదృష్టం ఏంటంటే గతంలో రాజకీయ పార్టీల నేతలు కొన్ని పాపాలు అక్కడ చేశారని గుర్తుచేశారు. శ్రీశైలం చాలా పెద్ద పవిత్ర స్థలం, కానీ ఈ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేయడానికి కుట్రలు చాలా కాలంగా జరుగుతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ముస్లింలను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని షాకింగ్ కామెంట్స్ చేశారు. మునుపటి పార్టీలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి క్రైస్తవ కుటుంబాలను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## విద్యుత్ షాక్ ఘటనలు బాధాకరం

**కేబుల్‌వైర్లతో కరెంట్ లైన్లపై ఒత్తిడి : ముషారఫ్ అలీ**



**హైదరాబాద్, ఆగస్టు 21 :** హైదరాబాద్ నగరంలో విద్యుత్ షాక్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌తో ఏడుగురు చనిపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీఎండీ ముషారప్ అలీ మాట్లాడుతూ.. టీవీ కేబుల్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ రెగ్యులర్‌గా కరెంట్ వైర్లకు దగ్గరగా పెట్టడంతో వర్షా కాలంలో ఇబ్బందులు తలెత్తే.. ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ అంశంపై గ్రేటర్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్స్‌తో చాల సార్లు సమావేశం ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయినా వాళ్ళు మారడం లేదన్నారు. అందువల్లే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తుందని స్పష్టంచేశారు. టీజీఎస్పీడీసీఎల్ సూచించిన ప్రమాణాల ప్రకారం కేబుల్ వైర్లు, సర్వీస్ ప్రొవైడర్లను వాడడం లేదన్నారు. ప్రస్తుతం వర్ష కాలంలో సాధ్యమైనంత వరకు జాగ్రత్తగా ఉండాలంటూ నగర వాసులకు ఆయన కీలక సూచన చేశారు. కేబుల్స్ కట్ చేయడం వల్ల ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలని ఇప్పటికే కేబుల్స్ ఆపరేటర్స్‌కు సూచించామన్నారు. అయితే కేబుల్స్ కట్ చేయడంపై తెలంగాణ హైకోర్టు కొన్ని కీలక సూచనలు చేసింది.. ఆ క్రమంలో కోర్టు వివరణ ఇచ్చిన తర్వాత.. తదుపరి యాక్షన్ ఉంటుందని సీఎండీ ముషారఫ్ అలీ వెల్లడించారు.

## రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**కాంగ్రెస్‌పై కావాలనే విష ప్రచారం : మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, ఆగస్టు 21 :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని, యూరియా విషయంలో కావాలనే బీఆర్ఎస్, బీజేపీ విష ప్రచారం చేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా సరఫరాపై బీజేపీ అసత్య ప్రచారం మానుకోవాలన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావుకు పలుకుబడి ఉంటే కేంద్రం నుంచి యూరియా తెప్పించాలని డిమాండ్ చేశారు. అయితే ఆయనకు అంత పలుకుబడి ఉందని తాను అనుకోవడం లేదని చెప్పారు. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉన్నదని తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భారతదేశం యూరియాను దిగుమతి చేసుకోలేకపోతున్నదని వెల్లడించారు. యూరియాను దాచుకుని తాము ఏం చేసుకుంటామని ప్రశ్నించారు. పదేపదే రాంచందర్ రావు విమర్శలు సరికాదన్నారు. బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. యూరియాపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డితో వ్యక్తిగతంగా మాట్లాడాలన్నారు. కేంద్రాన్ని ఒప్పించి రాంచందర్‌రావు యూరియా తెప్పించాలని కోరారు. యూరియా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిందంతా చేస్తున్నామన్నారు. కేంద్రం కూడా సహకరించాలని కోరారు. రాష్ట్రానికి ఆగస్టు వాటా యూరియా ఇవ్వాలని చెప్పారు. అత్యవసరాన్ని గుర్తించి యూరియాను త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరియాను కనీసం చూడని నేతలు కూడా విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. పెద్దపెద్ద మాటలు మాట్లాడి అభాసుపాలు కావొద్దని సూచించారు. తనను విమర్శించే వారు కేంద్రమంత్రి నడ్డాను అడగవచ్చని చెప్పారు. యూరియా సరఫరాపై అన్ని లెక్కలు ఇస్తున్నానని వెల్లడించారు. రాంచందర్‌రావు అంటే తనకు గౌరవం ఉందని, అబద్ధాలు చెప్పి బీజేపీని బాగుచేయాలంటే సాధ్యం కాదన్నారు. రైతులపై రాజకీయాలు చేసి పార్టీని పెంచుకోలేరని వెల్లడించారు. రాంచందర్‌రావు వాస్తవాలు ఒప్పుకోవాలని హితవుపలికారు.

# బీహార్ ఓట్ల తొలగింపు ఒక్కటే సమస్యా ?




కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వానాకాలం సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. బీహార్ ఓట్ల గొడవతో విపక్షాలు సమస్యలపై చర్చకు పూనుకోలేదు. రాజకీయంగా లబ్ది పొందే క్రమంలో దీనిపై రగడ చేస్తూనే ఉన్నారు. ఇకపోతే రాజకీయ నాయకుల నేరచరిత్రకు సంబంధించిన బిల్లు బుధవారం పార్లమెంట్ ముందుకు వచ్చింది. పదవిలో ఉంటూ ఏదైనా నేరాల్లో ఇరుక్కుని జైలు పాలయితే ఎంతటి పదవిలో ఉన్నా, అది ఉద్వాసన జరిగేలా ఓ చట్టం తీసుకుని వచ్చారు. ఇది అందరికీ సంబంధించినదే. కానీ విపక్షాలు దీనిని కూడా తప్పు పట్టాయి. అంటే రాజకీయ నేతలు నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అన్నది అర్థంకావడం లేదు. చట్టం ఎవరికైనా ఒక్కటే. దీనిపై చర్చించడంలో విపక్షాలు విఫలం అయ్యాయి. బీహార్ ఒక్కటే దేశ సమస్య కాదు. అందుకే గత జూలై 21న సమావేశాలు ప్రారంభం కాగా ఇప్పడి వరకు పెద్దగా చర్చలు సాగలేదు. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. మూడోదఫాలో మరింత సమర్థంగా, మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించడంలేదు. దేశంలో అభివృద్ది లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలపై చర్చ జరిపి ఉంటే బాగుండేది. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాల కు శ్రీకారం చుట్టాలి. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. కేవలం బీహార్‌పై వాయిదా తీర్మానం చర్చించాలన్న ధోరణిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మరచారు. అందువల్ల సమస్యలను గుర్తించి చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. దీనిపై గందరగోళం సృష్టించడం ద్వారా తాము విజయం సాధించామని భావిస్తున్నారు. అధికారం యావలో కాంగ్రెస్ ఇలాంటి చెత్త నిర్ణయాలు సాగిస్తోంది. బీహార్ వ్యవహారం బీహార్లో చర్చించాలి. అక్కడే తేల్చుకోవాలి. లేదా ప్రశ్న రూపంలో పార్లమెంటులో చర్చకు రావాలి. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యావశ్యకమే.

గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖాజానాపైనా భారీగా భారం పడుతోంది. గవర్నర్ వ్యవస్థలేని రాజ్యాలను నడుపుకోవాల్సి ఉంది. అలాగే ఎప్పుడో 50 ఏళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 542 సీట్లతోనే కొనసాగిస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ, రాజ్యసభలతో పాటు, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెరగాల్సి ఉంది. వాటిని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పెంచుకోవాల్సిందే. కనీసం వేయి సీట్లు ఉంటేనే ఇప్పుడున్న జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కదు. 140కోట్లు ఉన్న జనాభాకు అనగుణంగా పార్లమెంట్ సీట్లను పెంచుకోవాలి. అలాగే దేశానికి అనవసర వ్యవస్థగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పంచాయితీల్లో ఎంపిటిసిలు,జడ్పీటీసిల వ్యవస్థను ఎత్తేయాలి. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ, రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా పునర్వ్యవ స్థీకరణ జరగాలి. ఒకేదేశం, ఒకే చట్టం కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఇలాంటి కీలక నిర్ణయాలు కూడా జరగాలి. ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చించివుంటే బాగుండేది. ఇకపోతే ఎపిలో కాకినాడను ఆనుకుని ఉన్న యానాంను పాండిచ్చేరిలో కాకుండా ఎపిలో విలీనం చేయడంపై ఇంతవరకు ఏ ఒక్కరూ ఎక్కడా ప్రస్తావించడం లేదు. దీంతో ప్రజలకు కూడా పాలనా కేంద్రం దగ్గర కాగలదు. దీనిపై పాలకులు ఎందుకనో డిమాండ్ చేయడం లేదు.

ఇలాంటి వాటిని చర్చిస్తే మంచిది. ఇందుకోసం పార్లమెంటులో చర్చించాలి. వ్యవస్థల ద్వారా మేలు జరగాలి. ఉపయోగం కలగాలి. అంతేకానీ గుదిబండగా మారరాదు. అలాగే ఆర్థిక భారంగా కూడా మారరాదు. ఇప్పుడు ఎన్నికల సంస్కరణలతో పాటు రాజకీయ వ్యవస్థల పైనా విచారణ జరగాలి. గవర్నర్లు బిల్లుల తొక్కి పెట్టడంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది.ఇలాంటి వాటిని కూడా చర్చించాలి. అమిత్ షా ప్రవేశ పెట్టిన బిల్లులపైనా విపక్షాలు చర్చించాలి. తప్పులుంటే నిలదీయాలి. అంతేగాని గుడ్డిగా వ్యతిరేకించడం తగదు. అప్పుడే పార్లమెంట్ ఔన్నత్యం నిలుస్తుంది. అంతేగానీ తమకు అనుకూలంగా లని విషయాలపై అల్లరి చేయడం ద్వారా ప్రజలను అవమానపర్చరాదు.

# నిగ్రహం కోల్పోతున్న నేతలు


## విమర్శల్లో బజారు భాష తగదు



**హైదరాబాద్, ఆగస్ట్ 21 :** రాజకీయాల్లో విమర్శలు సహజమే. కానీ దానికోసం ఉపయోగిస్తున్న భాషే జుగుప్స కలిగిస్తోంది. నేతలు హుందాగా మాట్లాడాలి. హుందాగా వ్యవహరించాలి. మాటతీరు మనిషి హుందాతనం పెంచుతుంది. అవతలి వ్యక్తిపై ఎంతటి కసి ఉన్నా, వ్యతిరేకత ఉన్నా భాషతో జాగ్రత్తా ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అనుకుంటే..నిత్య జీవితంలో కూడా పత్రికల్లో వాడని భాషను వాడుతున్నారు. ఇష్టానుసారం మాటలు తూలుతున్నారు. అధికారంలో ఉన్నా.. విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో అడ్డమైన తిట్లు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగత వాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా..ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుష పదజాలంతో ఎవరైనా దూషిస్తే.. మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. భాష విషయంలో ఈ మధ్య కెటిఆర్, జగన్ పోటీపడి విమర్శలు చేస్తున్నారు. పలు సందర్భాల్లో సిఎం రేవంత్ రెడ్డి కూడా కట్టుతప్పుతున్నారు. సిఎంగా ఆయనకు ఇది ఉచితం కాదు. మంత్రిగా, సిఎంగా చేసిన కెటిఆర్, జగన్‌లకుకూడా ఇది సరికాదు. మహిళానేత రోజా కూడా ఇలాగే మాట్లాడుతుంటారు. తాము పదవుల్లో ఉన్నా లేకున్నా జ్ఞానం లేకుండా మాట్లాడరాదు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. తెలంగాణ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు. వాటిపైన దృష్టిని కాస్తా ఇప్పుడు విమర్శల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాట ల తూటాలు పేలుతున్నారు. రాజకీయ నాయకులు భాష వాడే ప్పుడు నోరు జారరాదని మాజీ ఉపరాష్ట్రపతి వెక్కయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తున్నారు. ఆయన మాటలు మననంలోకి తీసు కోవాలి. రాజకీయాల్లో బజారు భాష రాకుండా చూస్తే మంచిది.

# భారత్‌లో మరింత విస్తరించండి

## రష్యా కంపెనీలకు జైశంకర్ ఆహ్వానం



**న్యూఢిల్లీ :** భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు రష్యా, భారత్‌లు నూతన మార్గాలు అన్వేషించి ముందుకుసాగాలని విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారత్‌లోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించిన ఆయన, తద్వారా వ్యాపారాన్ని మరింత విస్తృత పరచుకోవాలని పిలుపునిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపాలని అమెరికా ఒత్తిడి తెస్తున్న వేళ మాస్కోలో కీలక పర్యటన చేపట్టిన జైశంకర్.. ఇరుదేశాలు సృజనాత్మకంగా ముందుకుసాగాలన్నారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని.. లేదంటే అధిక పన్నులు విధిస్తామని భారత్‌పై అమెరికా బెదిరింపులకు దిగుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రష్యాలో పర్యటిస్తున్న జైశంకర్.. రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్‌తో భేటీ అయ్యారు. వాణిజ్యం, ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ ఏడాది చివరలో భారత్‌లో పుతిన్ పర్యటనకు సంసిద్ధత లక్ష్యంతో విదేశాంగ మంత్రి పర్యటన కొనసాగుతోంది. ఈసందర్భంగా ఇరుదేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవడంతోపాటు వివిధ అంశాల్లో సహకరించుకోవాలని జైశంకర్ పిలుపునిచ్చారు. ఎక్కువగా, విభిన్నంగా చేయడమే ఇరువురి వాణిజ్యసూత్రంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని గుర్తుచేసిన ఆయన.. మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలతో విదేశీ వాణిజ్యానికి కొత్త ద్వారాలు తెరిచిందన్నారు. భారత్‌లో రష్యా కంపెనీల వ్యాపార విస్తరణకు ఇది మరింత దోహదం చేస్తుందన్నారు.

# ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు



**న్యూఢిల్లీ :** ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శరద్ పవార్ సహా విపక్ష పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్, డీఎంకే తిరుచ్చి శివ, టీఎంసీ నేత శతాబ్ది రాయ్, శివసేన (యూబీటీ) సంజయ్ రౌత్, సీపీఐ (ఎం) జాన్ బ్రిటాస్‌లు ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 160 మంది ఎంపీలు ఆయనకు మద్దతుగా సంతకాలు చేసినట్లు సమాచారం. నామినేషన్ పత్రాలను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రశీదును అందజేశారు. ఈసందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై నిబద్ధత, వినయభావంతో నామినేషన్ దాఖలు చేస్తున్నానని అన్నారు. తన జీవితం ప్రజాస్వామ్య సంప్రదాయాలతో ముడిపడి ఉందన్న ఆయన.. ప్రతి వ్యక్తి గౌరవం పైనే భారత్ వాస్తవశక్తి ఆధారపడి ఉందన్నారు. మరోవైపు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఆగస్టు 20న నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆయన తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మొత్తం ఎలక్టోరల్ కాలేజీ సంఖ్య 781 కాగా మెజార్టీ మార్కు 391. అధికార పక్షానికి 422 మంది సభ్యుల మద్దతు ఉంది.




# ఆ సమాచారం గగన్‌యాన్‌కు ఎంతో ఉపయోగం

## శుభాంశు శుక్లా

**న్యూఢిల్లీ :** అంతరిక్షయానం కోసం చాలా శిక్షణ తీసుకున్నట్లు భారత వ్యోమగామి కెప్టెన్ శుభాంశు శుక్లా తెలిపారు. దిల్లీలో ఆయన ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అంతరిక్షంలో తన అనుభవాలను పంచుకున్నారు. "ఇది దేశం మొత్తానికి చెందిన మిషన్. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న దాని కంటే.. అంతరిక్షంలో అనుభవం చాలా భిన్నంగా ఉంటుంది. అక్కడి నుంచి చూస్తే భూమి చాలా అద్భుతంగా కనిపించింది. యాక్సియం మిషన్ కోసం చాలా కష్టపడి పనిచేశాం. మన శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడ్డారు. ఐఎస్ఎస్ నుంచి కొన్ని ఫొటోలు తీసుకొచ్చాం. ఏడాదిగా ఈ మిషన్ కోసం ఎంతో సమాచారం సేకరించాను. ఈ సమాచారం గగన్‌యాన్ మిషన్‌కు ఉపయోగపడుతుంది. ప్రతి భారతీయుడి కలను నెరవేర్చడం నాకు గర్వ కారణం" అని తెలిపారు. "అంతరిక్షయానం కోసం శరీరాన్ని సిద్ధం చేసుకోవడం మరచిపోలేని అనుభవం. అంతరిక్షయానం ఎంతో జ్ఞానాన్ని ఇచ్చింది. ఈ మిషన్‌ను చేపట్టడంపై భారత ప్రభుత్వానికి, ఇస్రోకు, శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు" అని శుభాంశు తెలిపారు. ఇక డిసెంబరులో తొలి గగన్‌యాన్ టెస్టు మిషన్‌ను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని ఇస్రో చీఫ్ వి. నారాయణన్ తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఆయన సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. వ్యోమగాములు ధరించే ప్రత్యేక జాకెట్‌తో లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి వచ్చారు. తనతోపాటు ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లిన త్రివర్ణ పతాకాన్ని, యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన జ్ఞాపికను శుక్లా ప్రధానికి అందజేశారు.




# జీఎస్టీలో 2 శ్లాబుల ప్రతిపాదనకు మంత్రుల బృందం ఓకే

**దిల్లీ:** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల విషయంలో కీలక ముందడుగు పడింది. పరోక్ష పన్నుల విధానంలో రెండు శ్లాబులు ఉంచాలన్న కేంద్రం ప్రతిపాదనలకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. 12, 28 శాతం శ్లాబులు తొలగించి.. 5, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉంచేందుకు మంత్రుల బృందం అంగీకారం తెలిపినట్లు బిహార్ ఉప ముఖ్యమంత్రి, రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి జీవోఎం కన్వీనర్ సామ్రాట్ చౌధరి తెలిపారు. రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి కేంద్రం చేసిన రెండు ప్రతిపాదనలకూ జీవోఎం ఆమోదం తెలిపినట్లు సామ్రాట్ చౌధరి మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రతిపాదనలో అల్ట్రా లగ్జరీ, సిన్ గూడ్స్ (సిగరెట్లు వంటివి)పై 40 శాతం పన్ను విధించడం కూడా ఉందని యూపీ ఆర్థికమంత్రి సురేష్ కుమార్ ఖన్నా తెలిపారు. కార్లు, సిన్‌గూడ్స్ వంటి అల్ట్రా లగ్జరీ వస్తువులపై ప్రస్తుత పన్ను రేటు కొనసాగించేందుకు తమ రాష్ట్రం 40 శాతం జీఎస్టీ రేటుపై లెవీని ప్రతిపాదించిందని పశ్చిమబెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమా భట్టాచార్య తెలిపారు. ఈ కొత్త జీఎస్టీ శ్లాబ్‌ల అమలు తర్వాత కేంద్రం, రాష్ట్రాలకు కలిగే ఆదాయ నష్టం గురించి కేంద్రం చేసిన ప్రతిపాదల్లో ప్రస్తావించలేదని ఆమె పేర్కొన్నారు. రేట్ల హేతుబద్ధీకరణకు సంబంధించి సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల మంత్రుల బృందం గురువారం భేటీ అయ్యింది. ప్రస్తుతం నాలుగు శ్లాబుల స్థానే (5, 12, 18, 28 శాతం) రెండు శ్లాబులు మాత్రమే (5, 18) ఉంచేందుకు మంత్రుల బృందం అంగీకరించింది. దీంతో పాటు హానికర ఉత్పత్తులకు 40 శాతం జీఎస్టీ విధించేందుకు ఆమోదం తెలిపింది. జీఎస్టీ కౌన్సిల్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# రూ.799 ప్లాన్ కొనసాగుతుంది : జియో

**న్యూఢిల్లీ :** యూజర్లు ఎప్పటిలానే రూ.799 ప్రీపెయిడ్ ప్లాన్‌తో రీఛార్జి చేసుకోవచ్చని రిలయన్స్ జియో పేర్కొంది. 84 రోజుల వ్యాలిడిటీతో వస్తున్న ఈ ప్లాన్‌ను తొలగించినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించింది. జియో వెబ్‌సైట్‌తో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఈ ప్లాన్‌తో రీఛార్జి చేసుకోవచ్చని వెల్లడించింది. యూజర్ల అవసరాలకు అనుగుణంగా అందుబాటు ధరలో రీఛార్జి ప్లాన్లను అందించేందుకు జియో కట్టుబడి ఉందని పేర్కొంది. ఈ ప్లాన్‌తో రీఛార్జిపై రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు.



# అదుపులోకి రాని బంగారం ధరలు

## యథావిధిగా ధరల దోబూచులాట

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 :** దేశంలో బంగారం ధరలు దూసుకుపోతున్నాయి. పెరిగేప్పుడు తారాజువ్వలా పెరుగతూ.. తగ్గినప్పుడు తాబేలు నడకలా తగ్గుతున్నాయి. మొత్తంగా ట్యాక్స్ తగ్గినప్పుడు అమాంతంగా తగ్గినట్లు తగ్గినా పెరుగుదల మాత్రం ఆగడం లేదు. దీంతో బంగారం సామాన్యులకు అందుబాటులో లేదనే చెప్పాలి. ఇప్పటికే 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. లక్ష దాటేసింది. అయితే గతకొన్ని రోజుల క్రితం తులం బంగారం ధర ఏకంగా రూ. 92-94 వేలమార్క్‌కు చేరువై దడ పుట్టిచ్చిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో తులం బంగారం ధర రూ.లక్ష దాటడం ఖాయం అంటూ వార్తలు కూడా వచ్చాయి. అవే ఇప్పుడు నిజం అయ్యాయి. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,00,140గా ఉంది. 22 క్యారెట్‌ల 10 గ్రాముల బంగారం ధర రూ. 91,790గా ఉంది. కిలో వెండి ధర రూ.1,14,900కు చేరుకుంది.



# బైక్ ట్యాక్సీ లగ్జరీ కాదు.. అవసరం : కర్ణాటక హైకోర్టు

**కర్ణాటక :** రాష్ట్ర ప్రభుత్వం బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించడాన్ని కర్ణాటక హైకోర్టు తప్పుబట్టింది. బైక్ ట్యాక్సీ లగ్జరీ కాదని.. నగర ప్రజలకు అది అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విభు బఖ్రు నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. మధ్యతరగతి ప్రజలకు బైక్‌ట్యాక్సీలు ఎంతో ఉపయోగకరమైనవని.. దేశంలోని దాదాపు 13 రాష్ట్రాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని వ్యాఖ్యానించింది. మోటారు వాహనాల చట్టం బైక్ ట్యాక్సీలను నిషేధిస్తుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. బైక్ ట్యాక్సీలపై నిషేధం విధించడం వల్ల వాటిపైనే ఆధారపడిన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడతాయని.. ప్రజల జీవనోపాధి హక్కును పూర్తిగా హరించే అధికారం ఎవరికీ ఉండదని ఆగ్రహం వ్యక్తం చేసింది. బైక్ ట్యాక్సీలను మినహాయించడానికి రాష్ట్రం ఉద్దేశపూర్వకంగా విధాన వైఖరిని తీసుకుందా అని కోర్టు ప్రశ్నించింది. బైక్ ట్యాక్సీ డ్రైవర్లపై ప్రస్తుతానికి ఎటువంటి బలవంతపు లేదా శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా చూసుకోవాలని అడ్వకేట్ జనరల్‌ను న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 22కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల్లో తన నిర్ణయాన్ని తెలియజేయాలని సూచించింది. కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నట్లు 'బైక్స్ ట్యాక్సీ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రకటించింది. చట్టబద్ధమైన, సురక్షిత కార్యకలాపాలను కొనసాగించడానికి తాము ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది.



# గ్రామాభివృద్ధి ని అడ్డుకుంటున్న వారిపై చర్య తీసుకోవాలి

## అరూరు గ్రామం డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ సి.యన్.రెడ్డి

**వలిగొండ, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామం పంచాయతీ దగ్గర సిఎన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరూర్ ఎస్సీ కాలనీ నుంచి నూతనంగా నిర్మించబడిన కట్ట మైసమ్మ తల్లి గుడి కి కరెంటు స్తంభాలు కరెంటుకు సహకరించిన ఏ ఈ పై ప్రభుత్వ అధికారులపై కంప్లైంట్ చేసినందుకు వారు కరెంటు కట్ చేయడం జరిగింది . ఈ కంప్లైంట్ చేసిన వ్యక్తి కొడతల కరుణాకర్ ఈ విషయంపై ఆరూరు డెవలప్మెంట్ కమిటీ అఖిలపక్ష పార్టీ నాయకులతో అరూరు కొత్త గ్రామపంచాయతీ దగ్గర మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సీ కాలనీకి కరెంటు రావడం వల్ల కట్టమైసమ్మ గుడికి కరెంటు రావడం వల్ల కంప్లైంట్ చేసిన కొడతల కరుణాకర్ ఎలాంటి నష్టం జరుగుతుందో వారిని పిలిపించి అడుగుదామని మీటింగ్ ఏర్పాటు చేస్తే మీటింగుకు రాలేదు ఇది ఎంతవరకు సమంజసం అని కాబట్టి కట్టమైసమ్మ గుడికి ఈ విషయంపై అరూరు డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆలోచించి అభివృద్ధి విషయంలో అడ్డ వచ్చినా ఎవరినైనా ఎంత పెద్దవారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాట్లాడటం జరిగింది. ఇట్టి విషయంపై కంప్లీట్ చేసిన కొడతల కరుణాకర్ పై తగిన చర్యలు తీసుకొని ఎస్సీ కాలనీకి కరెంటు వచ్చే విధంగా గ్రామ ప్రజలు అఖిలపక్ష నాయకులు పెద్దలు అందరూ కలిసి ఓ నిర్ణయం తీసుకొని కరెంటు వచ్చే విధంగా గ్రామ ప్రజలు అఖిలపక్ష నాయకులు సహకరించాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అరూరు గ్రామం డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ సీ ఎన్ రెడ్డి అఖిలపక్ష పార్టీ నాయకులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.




# బోడుప్పల్ శ్రీ బంగారు మైసమ్మ ఆలయ కమిటీ మెంబర్‌గా గందె విశ్వేశ్వర్ గుప్త నియామకం

- ప్రమాణ స్వీకారం చేసిన ఆలయాల చైర్మన్లు కమిటీ మెంబర్లు
- హాజరైన మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, కొత్త కిషోర్ గౌడ్, పలువురు నాయకులు

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, కమిటీ మెంబర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం బోడుప్పల్ శ్రీ బంగారు మైసమ్మ ఆలయ కమిటీ మెంబర్ గా బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గందె విశ్వేశ్వర్ గుప్త, పలువురు నాయకులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బోడుప్పల్ లోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ సనాతన ధర్మాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరి మనోభావాలను కాపాడుతూ ఆలయాలకు మరింత శోభ తెచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. నూతన కమిటీ మెంబర్గా ఎన్ను కున్నందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

## వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగాకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకొని ఆదర్శంగా ఉండాలని వలిగొండ ఎస్సై వి యుగేందర్ గౌడ్ కోరారు. మండలంలో పలువురు గణేశ్ మండలి నిర్వాహకులతో గురువారం పోలీసులు సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలన్నారు. పరిమితికి మించి డీజే సౌండ్లను పెట్టుకోవద్దని, ఎలాంటి గొడవలకు తావులేకుండా శోభయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలని కోరారు.మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. సూచించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలని తెలిపారు. నిమజ్జనం చేసే సమయంలో చెరువుల దగ్గర జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన తెలిపారు.

# 'రష్యా చమురు'పై అమెరికా వాదనలు

## జైశంకర్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రష్యా నుంచి చమురు కొనుగోళ్ల వ్యవహారంలో అగ్రరాజ్యం చేస్తున్న వాదనలపై విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు సహా అన్ని చర్యలు తీసుకోవాలని అమెరికా కొన్నేళ్లుగా చెబుతున్నట్లు గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో అగ్రరాజ్యం వాదనల వెనుక ఉన్న లాజిక్ విషయంలో గందరగోళంగా ఉన్నట్లు చెప్పారు. "రష్యా చమురును భారీగా కొనుగోలు చేస్తున్న దేశం భారత్ కాదు. చైనా ఆ పని చేస్తోంది. అదేవిధంగా ఎల్‌ఎన్‌జీని కూడా మేం ఎక్కువగా కొనుగోలు చేయడం లేదు. ఐరోపా సమాఖ్య పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటోంది. 2022 తర్వాత రష్యాతో అత్యధిక వాణిజ్య వృద్ధి నమోదైన దేశం కూడా భారత్ కాదు. కొన్ని దక్షిణ దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరిం చేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు సహా ఆయా చర్యలు తీసుకోవాలని కొన్నేళ్లుగా అమెరికా చెబుతోంది. మేం అగ్రరాజ్యం నుంచి కూడా చమురు కొను గోలు చేస్తున్నాం. ఆ పరిమాణం కూడా పెరిగింది" అని జైశంకర్ తెలిపారు.

# మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో 'ఇజ్రాయెల్' ఆందోళనలు

## 18 మంది అరెస్టు



**ఇజ్రాయెల్ :** గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పాల్పడుతున్న దారుణాలపై మైక్రోసాఫ్ట్‌లోని కొందరు ఉద్యోగులు ఇటీవల తమ నిరసన గళం వినిపించిన విషయం తెలిసిందే. కంపెనీ రూపొందించిన టెక్నాలజీని ఉపయోగించి ఇజ్రాయెల్ సైన్యం దారుణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో వాషింగ్టన్ రెడ్‌మండ్‌లోని మైక్రోసాఫ్ట్ కార్యాలయ ప్రాంగణంలో 35 మందితో కూడిన ఓ బృందం గత రెండు రోజులుగా ఆందోళనకు దిగింది. కంపెనీ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు 18 మందిని అరెస్టు చేశారు. ఇందులో మైక్రోసాఫ్ట్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. మైక్రోసాఫ్ట్ రూపొందించిన ఓ సాఫ్ట్‌వేర్ సాయంతో గాజా, వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనియన్ల ఫోన్ కాల్ డేటాను ఇజ్రాయెల్ సైన్యం నిక్షిప్తం చేస్తోందంటూ బ్రిటన్‌కు చెందిన వార్తాపత్రిక ఇటీవల ఓ కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన టెక్ దిగ్గజం.. ఆ ఆరోపణలపై అత్యవసర సమీక్ష చేపడుతున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ఓ కన్సల్టింగ్ సంస్థను కూడా నియమించుకున్నట్లు తెలిపింది. దీంతో టెక్ సంస్థలో మళ్లీ నిరసనలు మొదలయ్యాయి. ఇందులోభాగంగా సంస్థ కార్యాలయం ముందు రెండు రోజులుగా ఓ బృందం నిరసన చేపట్టింది. కంపెనీ పరిసర ప్రాంతాల నుంచి వెళ్లిపోవాలని పోలీసులు కోరినా నిరసనకారులు వెనక్కి తగ్గలేదు. సంస్థ పేరున్న బోర్డుతోపాటు ఆ ప్రాంగణంలోను రంగులు చల్లుతూ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. పాదచారుల వంతెనను అడ్డుకోవడంతోపాటు వారు తెచ్చుకున్న ఫర్నీచర్‌నూ చిందరవందర చేశారు. దీంతో పోలీసులు చర్యలు చేపట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇజ్రాయెల్‌తో కాంట్రాక్టుల కు సంబంధించి మైక్రోసాఫ్ట్‌లో నిరసనలు వ్యక్తం కావడం ఇదే మొదటిసారి కాదు. సంస్థ సీఈవో సత్య నాదెళ్ల ప్రసంగాన్ని అడ్డుకున్న ఓ ఉద్యోగిపై మే నెలలో వేటు పడింది. ఏప్రిల్‌లో సంస్థ వార్షికోత్సవ కార్యక్రమాలకు అంతరాయం కలిగించిన ఇద్దరు ఉద్యోగులపైనా చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. మరోవైపు హమాస్‌పై దాడి తర్వాత మైక్రోసాఫ్ట్ ఏఐ సాంకేతికతను ఇజ్రాయెల్ సైన్యం విస్తృతంగా వాడుతున్నట్లు నివేదికలు వెల్లడించాయి. సైన్యానికి సాంకేతికతను అందిస్తున్న విషయాన్ని టెక్ దిగ్గజం ధ్రువీకరించినప్పటికీ.. గాజాకు హాని కలిగించే లక్ష్యంతో తమ సాంకేతికత లేదని స్పష్టం చేసింది.

# రైళ్ల టాయిలెట్లలో నీళ్ల సమస్య.. ఏడాదిలో లక్ష ఫిర్యాదులు



**న్యూఢిల్లీ :** భారతీయ రైల్వేలో ప్రయాణికుల సమస్యలకు సంబంధించి భారీస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తోంది. కేవలం ఒక ఏడాది (2022-23) కాలంలో టాయిలెట్‌లు, వాష్ బేసిన్‌లలో నీళ్లు లేవని పేర్కొంటూ లక్ష ఫిర్యాదులు వచ్చినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక వెల్లడించింది. ఇందుకు సంబంధించిన నివేదికను కాగ్ పార్లమెంటుకు అందించింది.

- సుదూరం ప్రయాణించే రైళ్లలో పరిశుభ్రతకు సంబంధించి 2018-19 నుంచి 2022-23 వరకు భారతీయ రైల్వే పనితీరుపై కాగ్ నివేదిక రూపొందించింది. ఇందులోభాగంగా కేవలం ఒక్క 2022-23 ఏడాదిలోనే టాయిలెట్లు, వాష్ బేసిన్‌లలో నీళ్లు లేవని 1,00,280 ఫిర్యాదులు వచ్చినట్లు గుర్తించింది. వీటిలో 33,937 కేసులను సకాలంలో పరిష్కరించినట్లు తెలిపింది.
- నిర్దేశిత స్టేషన్లలో నీరు నింపడంలో వైఫల్యం కారణంగానే ఈ సమస్య తలెత్తుతున్నట్లు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. ఆటోమేటిక్ కోచ్ వాషింగ్ ప్లాంట్లు ఉన్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో వినియోగంలో లేవని పేర్కొంది.
- మరోవైపు క్లీన్ ట్రైన్ స్టేషన్ కార్యక్రమం ఉద్దేశం మంచిదే అయినా, నిర్వహణ వైఫల్యం వల్ల పూర్తిస్థాయి సేవలు అందించలేకపోతోందని విమర్శించింది. అయితే, ఆన్‌బోర్డు హౌస్‌కీపింగ్ సర్వీసులపై మాత్రం ప్రయాణికులు సంతృప్తితో ఉన్నట్లు తెలిపింది.
- సుదూరం ప్రయాణించే రైళ్లలో బయో టాయిలెట్ పరిశుభ్రతపై ఎంపిక చేసిన 96 రైళ్లలో సర్వే చేయగా.. ఐదు జోన్లలో 50శాతం మంది ప్రయాణికులు మాత్రమే సంతృప్తి వ్యక్తంచేశారు. మరో రెండు జోన్లలో ఇది 10శాతం కంటే తక్కువగా ఉంది.
- రైళ్లలో పరిశుభ్రత కార్యకలాపాలకు సంబంధించిన బడ్జెట్, ఖర్చులను పరిశీలించిన కాగ్.. తుది కేటాయింపుల కంటే వాస్తవిక ఖర్చులు కొన్ని జోన్లలో ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది.
- ప్రజారోగ్యం, భద్రతపై ప్రభావం చూపుతున్నందున ప్రయాణికుల రద్దీని దృష్టిలోఉంచుకొని కోచ్‌లలో కచ్చితమైన పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలని భారతీయ రైల్వేకు సూచించింది.

# భావజాల శత్రువు భాజపా.. రాజకీయ విరోధి డీఎంకే : నటుడు విజయ్



**న్యూఢిల్లీ :** తమ భావజాల శత్రువు భాజపా.. రాజకీయ విరోధి డీఎంకే అని టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ పేర్కొన్నారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీకి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటి తలుపును తడతామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను ఉధృతం చేసిన ఆయన.. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు. తనను ఎంత విమర్శిస్తే అంత ఎదుగుతానని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామన్నారు. తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. "కులం కాదు.. మతం కాదు.. తమిళుడికే ప్రాధాన్యం ఇస్తాం. భాజపాతో చేతులు కలిపే ప్రసక్తే లేదు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తు పెట్టుకుంటున్నాయి. ఆరెస్సెస్ ముందు మనం ఎందుకు తలవంచాలి? తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయి. కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తాం. రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ దిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారు. ఆయన పాలన లో మహిళలకు రక్షణ లేకుండా పోయింది" అని విజయ్ విమ ర్శలు గుప్పించారు. 2024 ఫిబ్రవరిలో టీవీకేను స్థాపించిన ప్పటి నుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గతేడాది విల్లుపురం జిల్లాలోని విక్రవందిలో తొలి సభ నిర్వహించారు.

# అలాగైతే అమెరికానే గట్టిగా స్పందించాలి

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**యూఎస్ :** ద్వైపాక్షిక చర్చలకు రష్యా సానుకూలంగా స్పందించకపోతే అమెరికానే కలుగజేసుకొని గట్టిగా ప్రతిస్పందించాలని ఉక్రెయిన్ కోరింది. ఈ మేరకు కీవ్ అగ్రరాజ్యాన్ని అభ్యర్థించింది. తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం స్పందిస్తూ భూభాగం విషయంలో రష్యా ఎలాంటి రాయితీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందో అన్న విషయంపై స్పష్టత లేదన్నారు. తమ ఆఫర్ ఏమిటో తెలియాలంటే.. ముందు మాస్కో విషయం వెల్లడికావాలన్నారు. ఇక జకర్‌పట్టియ ప్రాంతంలో రష్యా జరిపిన దాడిలో అమెరికన్లతో సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారని జెలెన్‌స్కీ తెలిపారు. ఈ యుద్ధాన్ని ముగించేందుకు అర్థవంతమైన చర్చలకు వారు సిద్ధంగా ఉన్నారా అనే విషయంలో ఎటువంటి సంకేతాలు వెలువడలేదన్నారు. ఈ క్రమంలో బలమైన ఒత్తిడి, ఆంక్షలు, టారిఫ్‌లు అవసరమని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక చర్చల అంశంపై తాము తొలుత అంగీకారం తెలిపామని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కానీ, రష్యన్లు మాత్రం సిద్ధంగా లేరని వెల్లడించారు. అదే సమయంలో చర్చలకు వేదికగా ఎంపికచేసిన బుడాపెస్ట్ కూడా ఓ సవాలే అని పేర్కొన్నారు. హంగేరీ, రష్యా అత్యంత సన్నిహిత దేశాలు. గతంలో ఈ దేశం ఇరు దేశాల చర్చలకు వేదికగా ఉంటామని ఆఫర్ ఇచ్చింది. రష్యా దళాలు 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి ఆక్రమణ మొదలుపెట్టింది. ఇప్పటికే 20శాతం భూభాగాన్ని ఆక్రమించేసింది. క్రమంగా మాస్కో దళాలు తూర్పుదిశగా ముందుకు వెళుతున్నాయి. ఇక ఈ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో శ్రమిస్తున్నారు. ఇరు దేశాలు కొంత భూమి వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ గడ్డపైకి తమ సైన్యాన్ని పంపేది లేదని ట్రంప్ స్పష్టంచేసినట్టు వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లివిట్ ఇటీవలే వెల్లడించారు. గగనతలం లేదా ఇతర మార్గాల్లో సాయమందించే విషయం కాదనలేమని ఆమె తెలిపారు. "ఉక్రెయిన్‌కు అమెరికా గగనతల రక్షణ కల్పిస్తుందా?" అని విలేకరులు ప్రశ్నించగా, అందుకు అవకాశం ఉందని ఆమె బదులిచ్చారు.

# భారత్ స్నేహాన్ని కోల్పోవడం.. అమెరికా వైఫల్యం

## ఐక్యరాజ్యసమితి యూఎస్ మాజీ రాయబారి నిక్కీ హేలీ



**యూఎస్ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా భారత్‌పై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల సంబంధాల్లో కొంత ఒడుదొడుకులు నెలకొన్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితి యూఎస్ మాజీ రాయబారి నిక్కీ హేలీ స్పందిస్తూ.. న్యూదిల్లీతో వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని వాషింగ్టన్‌ను హెచ్చరించారు. న్యూదిల్లీతో స్నేహం కోల్పోతే.. అది అమెరికాకు రక్షణపరంగా లక్ష్య సాధనంలో వైఫల్యమే అవుతుందని ఓ వార్తా పత్రికకు రాసిన ఆర్టికల్‌లో ఆమె వ్యాఖ్యానించారు. భారత్- అమెరికా సంబంధాలు విచ్ఛిన్న దశలో ఉన్నాయన్నారు. న్యూదిల్లీని స్వేచ్ఛాయుత భాగస్వామిగా పరిగణించాలన్నారు. చైనాలాగా ప్రత్యర్థిగా చూడకూడదన్నారు. రష్యా నుంచి బీజింగ్ కూడా పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. దానిపై ఆంక్షలు విధించకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. ఆసియాలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో అమెరికా ఉంటే.. వెంటనే భారత్‌కు చేరువ కావాలని సూచించారు. లేదంటే అది యూఎస్‌కు వైఫల్యమే అవుతుందన్నారు.

### భారత్ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ

ఈసందర్భంగా యూఎస్‌లో ఉత్పత్తి చేయలేని వస్త్రాలు, చవకైన ఫోన్లు, సౌర ఫలకాలు వంటి వాటిని చైనా తరహాలో చేయగల సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందని నిక్కీ హేలీ పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఇజ్రాయెల్ వంటి అమెరికా మిత్ర దేశాలతో న్యూదిల్లీ తన సైనిక సంబంధాలు పెంచుకుంటుందన్నారు. మధ్యప్రాచ్యంలో దానికి ఆదరణ పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో భారత్ ప్రాముఖ్యం మరింత పెరుగుతుందన్నారు. 2023లో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనాను అధిగమించిందన్నారు. భారత డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను నిక్కీ తప్పుబట్టారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటని వ్యాఖ్యానించారు. న్యూదిల్లీ సామర్థ్యం పెరిగేకొద్దీ.. ప్రపంచంపై ఆధిపత్యం సాధించాలనే చైనా ఆశయాలు కుంచించుకుపోతాయన్నారు.

# ముఖ్యమంత్రిపై దాడి వేళ..

## దిల్లీ పోలీస్ కమిషనర్ మార్పు



**న్యూఢిల్లీ :** దిల్లీ నూతన పోలీస్ కమిషనర్‌గా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సతీశ్ గోల్చా నియమితులయ్యారు. ప్రస్తుత సీపీ శశిభూషణ్ కుమార్ సింగ్ స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. సీఎం రేఖా గుప్తాపై దాడి జరిగిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. గోల్చా ప్రస్తుతం దిల్లీ డీజీ (జైళ్లు)గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుందని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతుందని హోంశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదిలా ఉండగా.. సంజయ్ అరోరా పదవీ విరమణ నేపథ్యంలో ఆగస్టు 1న దిల్లీ సీపీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎస్‌బీకే సింగ్.. హోం గార్డ్స్ డీజీగా కొనసాగనున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న 'జన్ సున్వాయ్' కార్యక్రమంలో దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు.. పత్రాలను అందిస్తూ సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)గా గుర్తించారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. దిల్లీలోని వీధి కుక్కలను తరలిస్తున్నారనే కోపంతోనే తాను ఈ దాడికి పాల్పడినట్లు నిందితుడు పోలీసులకు చెప్పినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



# వీధి కుక్కలను తరలిస్తున్నారనే సీఎంపై దాడి

**న్యూఢిల్లీ:** ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సమయంలో దిల్లీ సీఎం రేఖా గుప్తా పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దిల్లీలోని వీధి కుక్కలను తరలిస్తున్నారనే కోపంతోనే తాను దిల్లీ ముఖ్యమంత్రిపై దాడి చేశానని నిందితుడు పోలీసులకు చెప్పినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించే ఏర్పాట్లుచేస్తున్నామని ఇటీవల దిల్లీ సీఎం రేఖాగుప్తా మీడియాకు తెలిపారు. జంతు ప్రేమికుడైన తనను ఈ విషయం ఎంతగానో బాధించడంతో.. ఈ చర్యలను నిలిపివేయాలని అభ్యర్థించడానికి ఆమెను కలిసేందుకు టికెట్ లేకుండా రైల్లో ప్రయాణించి మరీ గుజరాత్ నుంచి దిల్లీ వచ్చినట్లు సకారియా తెలిపాడు. ముఖ్యమంత్రిని తన నివాసంలో కలిసి కుక్కల సమస్య గురించి మాట్లాడడానికి ప్రయత్నించగా అది కుదరకపోవడంతో..'జన్ సున్వాయ్' కార్యక్రమానికి వెళ్లినట్లు నిందితుడు పేర్కొన్నాడు. సమస్యను రేఖా గుప్తాకు వివరించగా.. తన విజ్ఞప్తిని ఆమె పట్టించుకోకపోవడంతో కోపంతో దాడి చేశానన్నాడు. సకారియా కుక్కల సంరక్షణ సంస్థలతో కలిసి పని చేస్తుంటాడని.. అతడికి మూగజీవాలంటే ఇష్టమని కుటుంబసభ్యులు వెల్లడించినట్లు జాతీయమీడియా వర్గాలు పేర్కొన్నాయి. కుక్కలను షెల్టర్లకు తరలించాలని కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో అతడు తీవ్ర నిరాశకు గురయినట్లు చెప్పినట్లు తెలిపాయి. అయితే నిందితుడి వాదనను దిల్లీ మంత్రి కపిల్ మిశ్రా కొట్టిపడేశారు. నిందితుడు ఉద్దేశపూర్వకంగానే, ప్లాన్ ప్రకారమే దాడి చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. రేఖా గుప్తా నివాసం వద్ద అతడు తచ్చాడిన వీడియోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఊహించనివిధంగా తనపై జరిగిన దాడితో దిల్లీ ముఖ్యమంత్రి షాక్‌లో ఉన్నారని కపిల్ మిశ్రా అన్నారు. గాయాలైనప్పటికీ ఆమె ఇంటి పని చేస్తున్నారన్నారు. తాజాగా జరిగిన దాడి నేపథ్యంలో రేఖా గుప్తాకు ముప్పు పొంచి ఉండడంతో ఆమెకు 'జడ్' కేటగిరి భద్రతను కల్పిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 40-45 మంది సిబ్బంది సీఎంకు రక్షణ కల్పించే విధుల్లో ఉంటారు.

# ఆధార్, యూఏఎన్‌ల అనుసంధానం ఇక ఈజీ

ఆధార్, యూఏఎన్ అనుసంధాన ప్రక్రియను ఉద్యోగ భవిష్యనిధి సంస్థ సులభతరం చేసింది. ఆధార్‌లోని పేరు, పుట్టిన తేదీ వివరాలు యూనివర్సల్ అకౌంట్ నంబర్‌లోని వివరాలతో సరిపోలితే యజమాని నేరుగా కేవైసీ ఆధారంగా అనుసంధానం చేయవచ్చని తెలిపింది. ఇందుకోసం ఈపీఎఫ్ఓ పోర్టల్లోని కేవైసీ ఫీచర్‌ను ఉపయోగించవచ్చు. చాలా సందర్భాల్లో ఆధార్‌లోని వివరాలు యూఏఎన్ రికార్డుల్లోని వ్యక్తిగత వివరాలతో సరిపోలకపోవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో గతంలో అయితే ఉడాయ్ కేంద్రానికి వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు ఈ ప్రక్రియనూ ఈపీఎఫ్ఓ సులభతరం చేసింది. ఇందుకోసం జాయింట్ డిక్లరేషన్ సౌకర్యాన్ని తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. యజమానితో కలిసి ఉద్యోగి జాయింట్ డిక్లరేషన్ సమర్పిస్తే సరిపోతుంది. దీనిద్వారా యూఏఎన్‌లో తప్పుగా నమోదైన వివరాలను సులువుగా సరిదిద్దుకోవచ్చు. గతంలో ఇదే ఆధార్, యూఏఎన్ అనుసంధాన ప్రక్రియ కష్టంగా ఉండేది. అనేక అప్రూవల్స్, పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండేది. కానీ ఇప్పుడు డిజిటల్ సిస్టమ్ వల్ల ఈ ప్రక్రియ సరళంగా మారింది. ఈ మార్పుతో ఉద్యోగులు తమ పీఎఫ్ అకౌంట్‌కు సంబంధించిన ప్రయోజనాలను త్వరగా పొందే అవకాశం ఉంటుంది. అంతేకాదు చందాదారు మరణించిన సందర్భంలో మైనర్లకు పింఛను, ఇతర చెల్లింపులకు గార్డియన్‌షిప్




(సంరక్షణ) సర్టిఫికెట్ అవసరం లేదని ఈపీఎఫ్ఓ తాజాగా స్పష్టంచేసింది. కొన్ని కార్యాలయాలు ఆ సర్టిఫికెట్ అడుగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది.






## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 142 పాయింట్లు, నిఫ్టీ 33 పాయింట్ల లాభంతో ముగిశాయి. ప్రధాన రంగాలకు చెందిన అన్ని సూచీల విలువ పెరిగింది. జీవిత, ఆరోగ్యబీమాపై జీఎస్టీ తొలగింపు వంటి చర్యలు తాజాగా మార్కెట్‌లో జోష్ నింపాయి. దీనికితోడు భారత ఆర్థికవ్యవస్థ బలంగా, స్థిరంగా ఉందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన ప్రకటన ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం పెంచింది. దీంతో గురువారం సెన్సెక్స్ 82,000.71, నిఫ్టీ 25,083.75 వద్ద ముగిశాయి.



## బీమాపై జీఎస్టీ మినహాయిస్తే ప్రీమియం ఎంత తగ్గొచ్చు..?

దేశీయంగా బీమా మార్కెట్‌ను విస్తరించడంతోపాటు.. పెట్టుబడుల కోసం ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలోభాగంగా మంత్రుల బృందం వీటిపై పూర్తిగా వస్తుసేవల పన్ను నుంచి మినహాయించాలని ప్రతిపాదనలు చేసింది. దీంతో జీవిత, ఆరోగ్యబీమా ప్రీమియం తగ్గొచ్చని వినియోగదారులు అంచనా వేస్తున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నా.. పూర్తిగా జీఎస్టీ మేరకు తగ్గే అవకాశం ఉండకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ప్రస్తుతం జీఎస్టీ భారం ఎంత..?

ప్రస్తుతం జీవిత, ఆరోగ్యబీమాపై కొత్త పాలసీ లేదా రెన్యువల్ ప్రీమియంపై 18శాతం వస్తుసేవల పన్ను చెల్లిస్తున్నాం. ఉదాహరణకు రూ.20,000 ప్రీమియం అయితే.. దానికి జీఎస్టీ కలిపి రూ.23,600 అవుతుంది. ఇది వ్యక్తిగత, ఫ్యామిలీ ఫ్లోటర్లకు వర్తిస్తోంది. కొన్నిరకాల సింగిల్ ప్రీమియం జీవిత బీమా పాలసీలపై మాత్రం 4.5 శాతం రేటు తొలి సంవత్సరం ప్రీమియంపై వర్తిస్తుంది. అత్యధిక పాలసీల జీఎస్టీ రేటు 18శాతంగా ఉంది.

### కొత్త ప్రతిపాదనల ప్రకారం..

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీ తొలగించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. కేంద్రం కూడా దీనికి మద్దతు ఇస్తోంది. జీఎస్టీ కౌన్సిల్ ఆమోదిస్తే ఇది కార్యరూపం దాలుస్తుంది. అప్పుడు బీమా సంస్థ చెప్పిన బేస్ ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ఈ నిర్ణయంతో వినియోగదారులకు 15శాతం వరకు బీమా ధర తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో జీవిత, ఆరోగ్యబీమాలు కలిపి రూ.8,262 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి అందించాయి. ఇక రీఇన్స్యూరెన్స్ మరో రూ.1,500 కోట్లు తీసుకొచ్చింది.

### మరి ప్రీమియం తగ్గుతుందా..?

ఈ నిర్ణయం అమలైతే ప్రీమియం తగ్గేమాట నిజమే. కానీ, ఇక్కడ చిన్న మెలిక ఉంది. ఇప్పటివరకు బీమా సంస్థలు టెక్నాలజీ, కస్టమర్ సర్వీస్, డిస్ట్రిబ్యూషన్ వంటి వాటిపై చెల్లించిన వ్యయాలను ఇన్‌పుట్ ట్యాక్స్ రూపంలో వెనక్కి తీసుకొంటున్నాయి. ఇప్పుడు ప్రీమియంపై జీఎస్టీని తొలగిస్తే.. ఇన్‌పుట్ క్రెడిట్ కూడా వాటికి ఆగిపోతుంది. ఆమేరకు బీమా సంస్థలు చేసిన వ్యయాలు వెనక్కి రావు. దీంతో ఆ నష్టాలను భర్తీ చేసుకోవడానికి బేస్ ప్రీమియం ధరను పెంచవచ్చు. ఇది కూడా ఉండకూడదనుకొంటే.. పాలసీలపై జీఎస్టీని '0' రేటుకు తీసుకురావాల్సి ఉంటుంది. అప్పుడు సంస్థలు ఇన్‌పుట్ క్రెడిట్‌ను పొందడంతో.. వినియోగదారులకు బేస్ ప్రీమియం పెరగదు. వీటితోపాటు ఈ లబ్ధిని బీమా సంస్థలు వినియోగదారులకు బదిలీ చేయడం కూడా కీలకమే. సెప్టెంబర్ మధ్యలో జీఎస్టీ కౌన్సిల్ భేటీ ఉంది. ఈ పాలసీలపై నిర్ణయం దీపావళి నాటికి అమల్లోకి రావచ్చు. ప్రభుత్వ ప్రకటన వెలువడేవరకు వేచి చూడాల్సిందే.

## అజిత్ అగార్కర్‌కు మళ్లీ ఎక్స్‌టెన్షన్..



ఆసియా కప్ కోసం జట్టును ప్రకటించిన రెండు రోజులకే సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్‌కు బీసీసీఐ ప్రమోషన్ ఇచ్చింది. అతడి పదవీకాలాన్ని పొడిగిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది జూన్ వరకు అతడు చీఫ్ సెలక్టర్ పదవిలో ఉంటాడు. 2023లో చీఫ్ సెలక్టర్‌గా ఎంపికైన అజిత్ పనితీరుపై బీసీసీఐ మేనేజ్‌మెంట్ సంతృప్తిగా ఉంది. దీంతో గత ఐపీఎల్ సీజన్‌కు ముందే ముగియాల్సిన పదవీకాలం పొడిగించింది. ఇప్పుడు మళ్లీ ఎక్స్‌టెన్షన్ ఇవ్వనుండటం గమనార్హం. 2026లో టీ20 ప్రపంచకప్ ఉంది. అది ముగిసిన తర్వాత మరోసారి అజిత్ అగార్కర్ పదవిపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. అజిత్ వచ్చాక టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కప్‌లను గెలవడంతోపాటు వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌కు భారత్ చేరుకుంది. శుభ్‌మన్ గిల్‌కు టెస్టు కెప్టెన్సీ ఇవ్వడం కూడా అగార్కర్ హయాంలోనే జరిగింది.

### అతడి స్థానంలో మరొకరు..

టీమ్ సెలక్షన్ కమిటీలో చీఫ్ సెలక్టర్ కాకుండా ఐదుగురు సభ్యులు ఉంటారు. ప్రస్తుతం ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్.శరత్ మెంబర్స్ కాగా.. చీఫ్ సెలక్టర్‌గా అజిత్ అగార్కర్ వ్యవహరిస్తున్నాడు. బీసీసీఐ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్‌లో జరగనుంది. సెలక్షన్ కమిటీలో పలు మార్పులు చేసే అవకాశం ఉంది. ఒకరిని తొలగించి.. మరొకరికి ఛాన్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఎస్.శరత్ స్థానంలో కొత్తవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. బీసీసీఐ నిబంధనల ప్రకారం కమిటీ సభ్యుడికి నాలుగేళ్లు మాత్రమే పదవీకాలం ఉండాలి. ఈ లెక్కన శరత్ టెన్యూర్ ముగియనుంది. మరోవైపు ఎస్ఎస్ దాస్, బెనర్జీ విషయంలో మేనేజ్‌మెంట్ సంతృప్తికరంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

### ఇప్పటికే వాటికోసం దరఖాస్తుల ఆహ్వానం

సీనియర్ ఉమెన్స్, జూనియర్ మెన్స్ జట్ల సెలక్షన్ కమిటీల నియామకం కోసం ఇప్పటికే బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రస్తుతం మహిళా క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఆర్తి వైద్య, మెంబర్ మిథు ముఖర్జీ ఐదేళ్ల పదవీకాలం ఈ సీజన్‌లో ముగియనుంది. ఇక జూనియర్ సెలక్షన్ ప్యానల్‌లో తిలక్ నాయుడు, రానాదెబ్ బోస్, హర్విందర్ సింగ్ సోధి, పాతిక్ పటేల్,

## 'గిల్‌ను తీసుకోవడంలో తప్పులేదు

### కానీ వారిద్దరిని ఎందుకు పక్కన పెట్టారు?'



యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ టీ20 ఫార్మాట్లో జరగనుంది. దీనికి సంబంధించి భారత జట్టును మంగళవారం ప్రకటించారు. శుభ్‌మన్ గిల్‌కు అనూహ్యంగా జట్టులో స్థానం దక్కడంతోపాటు, ఏకంగా వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ నిర్ణయాన్ని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఎస్.బద్రీనాథ్ సమర్థించాడు. కానీ.. అదే సమయంలో జట్టులో యశస్విజైస్వాల్, ఐపీఎల్ 2025లో రాణించి, ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్న సాయిసుదర్శన్‌కు స్థానం కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'టీమ్‌ఇండియా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా శుభ్‌మన్ గిల్‌కు జట్టులో స్థానం కల్పించడం, అతణ్ని వైస్ కెప్టెన్‌గా చేయడం సరైన నిర్ణయమే. కానీ యశస్వి జైస్వాల్‌ను ఎందుకు ఎంపిక చేయలేదు. అతడు టీ20ల్లో గిల్ కంటే మెరుగ్గా రాణిస్తున్నాడు. అలాగే ఐపీఎల్ 2025లో దాదాపు 700 పరుగులు చేసిన సాయి సుదర్శన్‌ను ఎందుకు తీసుకోలేదు. అలాగే సంజు శాంసన్‌కు కూడా తుది జట్టులో చోటు దక్కుతుందో? లేదో తెలియని పరిస్థితి' అని ఎస్.బద్రీనాథ్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. శుభ్‌మన్ గిల్‌కు జట్టులో ఎలా భాగమయ్యాడనే విషయాన్ని కూడా అతడు విశ్లేషించాడు. 'శుభ్‌మన్ గిల్ గత రెండు, మూడు సంవత్సరాలుగా టీ20 జట్టులో లేడు. అయినప్పటికీ అతణ్ని ఏకంగా వైస్- కెప్టెన్‌ను చేశారు. ఇక్కడ ఓ విషయం స్పష్టంగా తెలుస్తోంది. అదేంటంటే.. గిల్, ఇంగ్లాండ్ టూర్‌లో టెస్ట్ మ్యాచుల్లో బ్యాటర్‌గా అద్భుతంగా రాణించాడు. కెప్టెన్‌గానూ మంచి మార్కులు సంపాదించుకున్నాడు. ఆసియా కప్‌లో గిల్ తప్పకుండా అభిషేక్ శర్మతో కలిసి ఓపెనింగ్‌కు వస్తాడు' అని ఎస్.బద్రీనాథ్ విశ్లేషించాడు. శుభ్‌మన్ గిల్ ఇంతకు ముందు తన చివరి టీ20 మ్యాచ్‌ను జులై 2024లో ఆడాడు. ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లు ఆడిన గిల్ 139.27 స్ట్రైక్‌రేట్‌తో 578 పరుగులు సాధించాడు. అదే సమయంలో 23.. టీ20 మ్యాచ్‌లు ఆడిన యశస్వి జైస్వాల్ 164.31 స్ట్రైక్‌రేట్‌తో 723 పరుగులు చేశాడు.

## సారథ్యం నుంచి రహానే నిష్క్రమణ

### యువ క్రికెటర్‌కు ఛాన్స్?



దేశవాళీ క్రికెట్‌లో ముంబయి జట్టును నడిపించిన అజింక్య రహానె సంచలన నిర్ణయం తీసుకున్నాడు. కెప్టెన్సీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. మరికొద్ది రోజుల్లో దులీప్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో రహానె నిర్ణయం అభిమానులను షాక్‌కు గురి చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనప్పటికీ.. దేశవాళీలో అద్భుత ఫామ్‌తో కొనసాగుతున్నాడు. అయితే, జట్టుకు కొత్త కెప్టెన్‌ను నియమించాల్సిన అవసరం ఉందంటూ సోషల్ మీడియా వేదికగా రహానె పోస్టు పెట్టాడు. "ముంబయి జట్టుకు నాయకత్వం వహించడం, ట్రోఫీలను గెలవడం ఎప్పటికీ మరిచిపోలేను. అదొక గొప్ప గౌరవం. కొత్త సీజన్‌లో జట్టుకు నూతన సారథ్యం అవసరమని భావిస్తున్నా. కొత్త నాయకత్వంలో ముంబయి జట్టు మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశిస్తున్నా. ప్లేయర్‌గా ఇంకా నా పూర్తిస్థాయి ప్రదర్శన ఇచ్చేందుకు నిరంతరం శ్రమిస్తా. ముంబయి క్రికెట్ అసోసియేషన్‌తో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. మరిన్ని ట్రోఫీలు గెలిచేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాం. కొత్త సీజన్‌లో మరింత దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నా" అని పోస్టు పెట్టాడు. 37 ఏళ్ల రహానె నాయకత్వంలో ముంబయి అద్భుత విజయాలను నమోదు చేసింది. అదే సమయంలో కీలక మ్యాచుల్లోనూ తడబాటుకు గురైంది. ఇరానీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలను రహానె నాయకత్వంలో ముంబయి గెలుచుకుంది. రంజీట్రోఫీ (2023-24) ఫైనల్‌లో విదర్భ చేతిలో ఓటమిని చవిచూసింది. ఇప్పటి వరకు రహానె 201 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 14వేలకుపైగా పరుగులు చేశాడు.

### యశస్వికా? శ్రేయస్‌కా?

ముంబయి జట్టులో నాణ్యమైన ఆటగాళ్లకు కొదవేం లేదు. శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్, యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ తదితర అంతర్జాతీయ క్రికెటర్లు ఉన్నారు. ఇప్పటికే శ్రేయస్, సూర్య ఐపీఎల్‌లో సారథ్యం చేపట్టిన అనుభవం ఉంది. టెస్టుల్లో యశస్వి జైస్వాల్ దూకుడు చూస్తూనే ఉన్నాం. వారిద్దరితో పోలిస్తే యశస్వి సుదీర్ఘ ఫార్మాట్‌లో మంచి ఇన్నింగ్స్‌లు నిర్మించగల సమర్థుడు. ఇటీవలే అతడు గోవా జట్టుకు ఆడదామనే ఆలోచనను కూడా విరమించుకున్నాడు. ఈ క్రమంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యశస్వికే జట్టు పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదు. శ్రేయస్ అయ్యర్ కూడా గట్టిపోటీదారే.

## శ్రేయస్ అయ్యర్‌కు వన్డే కెప్టెన్సీ ఇస్తారా?



టీ20 ఫార్మాట్‌తో జరగనున్న ఆసియా కప్ కోసం బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఇప్పటికే భారత జట్టును ప్రకటించింది. అందులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. సూర్యకుమార్ యాదవ్‌కు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్‌ను నియమించింది. ఇటీవల మంచి ఫామ్ కనబరిచినా శ్రేయస్‌కు మొండిచేయి ఎదురు కావడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. తాజాగా మరో కథనం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటి వరకూ మూడు ఫార్మాట్లకు ఒకే సారథిని నియమిద్దామని అనుకుంటోన్న మేనేజ్‌మెంట్ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత టెస్టు జట్టుకు సారథిగా శుభ్‌మన్ గిల్ ఉన్నాడు. టీ20లకు సూర్యకుమార్ యాదవ్.. వన్డేలకు రోహిత్ శర్మ నాయకత్వ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు గిల్‌ను పొట్టి ఫార్మాట్‌కు వైస్ కెప్టెన్‌గా చేయడంతో భవిష్యత్తులో అతడికే సారథ్యం అప్పగిస్తారని ఖరారు అయిపోయింది. ఇక రోహిత్ శర్మ వచ్చే వన్డే ప్రపంచ కప్ వరకూ ఆడాలనే లక్ష్యంతో ఉన్నాడు. అయితే, రోహిత్‌ను వన్డే సారథ్యం నుంచి తప్పించి శ్రేయస్‌ను వరల్డ్ కప్ 2027 వరకూ నియమిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ తర్వాత కూడా గిల్‌ను ఏకైక సారథిగా చేయకపోవచ్చని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### వర్క్‌లోడ్ కారణంగానేనా?

ఇంతకుముందు మూడు ఫార్మాట్లకు ఒకే సారథిగా ఉన్నా పెద్దగా ఒత్తిడి ఉండేది కాదు. అప్పుడు ఇన్ని టోర్నీలు, సిరీస్‌లు ఉండేవి కావు. కానీ, ఇప్పుడు టెస్టుల్లో ఛాంపియన్‌షిప్, వన్డేల్లో వరల్డ్ కప్‌తోపాటు ఛాంపియన్స్ ట్రోఫీ మళ్లీ రావడం, టీ20ల్లో వరల్డ్ కప్.. ఇలా టోర్నీలూ ఎక్కువైపోయాయి. ఇక ఆసియా కప్ ఎలానూ రెండేళ్లకొకసారి వస్తూనే ఉంది. క్రికెట్ క్యాలెండర్ బిజీగా మారిపోయింది. దీంతో కెప్టెన్‌పై వర్క్‌లోడ్ అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రోహిత్ శర్మకు 38 ఏళ్లు దాటాయి. వన్డే ప్రపంచకప్ నాటికి అతడికి 40ం అవుతాయి. గిల్‌కే బాధ్యతలు అప్పగించాలని తొలుత మేనేజ్‌మెంట్ భావించింది. కానీ, వర్క్‌లోడ్ కారణంగా అతడి ప్రదర్శనపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన వ్యక్తమైంది. దీంతో వన్డేలకు రోహిత్ బదులు శ్రేయస్‌ను సారథిగా నియమిస్తే బాగుంటుందనే వాదనా ఉంది. ఆసియా కప్ తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశమై రోహిత్, విరాట్ భవితవ్యంపై చర్చిస్తారని.. శ్రేయస్‌ను కెప్టెన్‌గా చేస్తారన్న కథనాలు వచ్చాయి.

# ఫాస్టాగ్ వార్షిక పాస్..
# ఈ రహదారులకు వర్తించదు

వాహనదారుల కోసం స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా కేంద్ర ప్రభుత్వం ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. రూ.3 వేలు చెల్లించి కొనుగోలు చేస్తే ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుంది. సగటున రూ.15తో టోల్ ప్లాజాను దాటేందుకు ఈ పాస్ ఉపయోగపడుతుంది. వాహనదారుల నుంచి కూడా ఈ పాస్‌కు అద్భుత స్పందన లభిస్తోంది. కేవలం 24 గంటల్లోనే 1.4 లక్షల మంది ఈ పాస్‌ను కొనుగోలు చేశారు. అయితే ఈ ఫాస్టాగ్‌ను ఎవరెవరు తీసుకోవచ్చు? ఏయే రహదారులకు వర్తిస్తుంది?

### అన్ని వాహనాలకూ కాదు

వ్యక్తిగత వాహనదారులకు ఊరట కల్పించే లక్ష్యంతో ఈ పాస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. అయితే, వ్యక్తిగత కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ ఫాస్టాగ్ వర్తిస్తుంది. వాణిజ్య వాహనాలకు చెల్లుబాటు కాదు. వాహన్ డేటాబేస్ ఆధారంగా వాహన రకాన్ని గుర్తిస్తారు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు మళ్లీ కొత్త ఫాస్టాగ్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. పాత ఫాస్టాగ్‌తోనే టోల్‌పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు.

### ఈ రహదారులకు వర్తించదు

ఈ ఫాస్టాగ్ కేవలం జాతీయ రహదారులకు మాత్రమే వర్తిస్తుంది. జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేల మీద ఉండే టోల్ ప్లాజాల వద్ద మాత్రమే ఉపయోగపడుతుంది. సరళంగా చెప్పాలంటే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, జాతీయ రోడ్లు, రహదారులు మంత్రిత్వశాఖ నిర్వహించే టోల్‌ప్లాజాల వద్ద మాత్రమే ఈ పాస్ చెల్లుబాటు



అవుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 1159 టోల్ ప్లాజాల వద్ద పాస్ చెల్లుతుంది. అయితే, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ వేలు, రహదారులపై ఉండే టోల్ ప్లాజాల వద్ద పాస్ చెల్లదు. ఉదాహరణకు హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్ట్. దీన్ని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ ప్రస్తుతం నిర్వహిస్తోంది. ఇక్కడ వార్షిక పాస్ వర్తించదు. అలాగే, ఏపీలో తిరుమల కొండపైకి వెళ్లేటప్పుడు సప్తగిరి టోల్ ప్లాజా వద్ద కూడా ఈ వార్షిక పాస్ చెల్లదు. ఆయా టోల్‌ప్లాజాలు దాటినప్పుడు సాధారణ ఛార్జీలు వర్తిస్తాయి. కాబట్టి ఫాస్టాగ్ తీసుకునేటప్పుడు మీరు దాటబోయే టోల్ ప్లాజాలు ఎవరి పరిధిలోకి వస్తాయో తెలుసుకోవడం కూడా ముఖ్యం.

### ఎలా యాక్టివేట్ చేసుకోవాలి?

- ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- NHAI, morth వెబ్‌సైట్లలో కూడా లింక్ అందుబాటులో ఉంటుంది.
- మొబైల్ నంబర్, వాహన నంబర్, ఫాస్టాగ్ వివరాలు ఎంటర్ చేసి లాగిన్ కావాలి.
- పేమెంట్ గేట్‌వే ద్వారా రూ.3వేలు చెల్లించాలి. అనంతరం రెండు గంటల్లో పాస్ యాక్టివేట్ అవుతుంది. మొబైల్‌కు ఎస్సెమ్మెస్ కూడా వస్తుంది.


# దర్శకత్వంలోకి నేహాశర్మ

చిరుత సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది నేహా శర్మ. ఈ సినిమా తర్వాత నేహా శర్మ పలు తెలుగు, హిందీ సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయాయి. అయితే నేహా శర్మ సినిమాలతో బ్రేక్ అందుకోలేకపోయినా ఏ మాత్రం నిరాశ చెందకుండా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటూ అందరిలో జోష్ నింపుతోంది. కాగా ఈ భామకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ బ్యూటీ- ఇక డైరెక్టర్‌గా తన లక్‌ను పరీక్షించుకు నేందుకు రెడీ అవుతుంది. బాలీవుడ్ స్టార్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ నిర్మించనున్న పీరియాడిక్ క్రియేచర్ డ్రామాకు నేహాశర్మ దర్శకత్వం వహించనుందన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారింది.



# అందుకే సినిమాలు తగ్గించాను: సమంత

నటిగానే కాకుండా నిర్మాతగానూ సరికొత్త కథలను ప్రేక్షకులకు అందిస్తూ అగ్ర కథానాయిక సమంత ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా ఈ బ్యూటీ ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన విషయం తెలిసిందే. ఆ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమని సమంత చెప్పారు. 15 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటోన్న ఆమె ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో ఎంతో మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఫిట్‌నెస్, సినిమాలు రెండిటిపైనా దృష్టిపెట్టాను. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే" "తక్కువ ప్రాజెక్ట్‌లు చేయాలని నిర్ణయించుకున్నా. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ, తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్ట్‌ల సంఖ్య తగ్గింది.. కానీ, వాటి నాణ్యత కచ్చితంగా పెరుగుతుంది" అని చెప్పారు.



# విశ్వంభర వాయిదా

## వచ్చే ఏడాదికి మార్చినట్లు చిరు వెల్లడి



మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర' సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం ఇప్పటికే చాలా సార్లు వాయిదా పడింది. వాస్తవానికి 2025 సంక్రాంతికే ఈ సినిమా రిలీజ్ కావల్సి ఉన్నా సమ్మర్‌కి పోస్ట్ పోన్ చేశారు. అయితే ఇప్పటికే మూవీకి సంబంధించి విడుదలైన గ్లింప్స్ కి నెగిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా వి.ఎఫ్.ఎక్స్ గురించి చాలా నెగిటివ్ కామెంట్స్ వినిపించాయి. దీంతో నిర్మాతలు క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాకూడదు అని భావించి మూవీని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. క్వాలిటీ ఔట్‌పుట్ తోనే సినిమాని జనాల్లోకి వదలాలని భావించారు చిత్ర బృందం. కొద్ది సేపటి క్రితం యూవీ క్రియేషన్ చిన్న వీడియోని విడుదల చేయగా, ఇందులో చిరంజీవి ఆసక్తికర విషయాలు తెలియజేశారు. మూవీ ఆలస్యానికి కారణం మీకు అత్యున్నత ప్రమాణాలతో, బెస్ట్ క్వాలిటీతో మూవీని మన ముందుకు తీసుకురావాలనే చిత్ర బృందం ఇంత సమయం తీసుకుంటుందని చిరంజీవి అన్నారు. ఇది చందమామ కథలాగా సాగిపోయే అద్భుతమై కథ. చిన్న పిల్లలతో పాటు పెద్దవాళ్లలో ఉండే చిన్న పిల్లలకి ఈ సినిమా బాగా నచ్చుతుంది అని చిరంజీవి అన్నారు.

ఇక మూవీని 2026 సమ్మర్‌కి విడుదల చేయనున్నట్టు చిరంజీవి స్వయంగా చెప్పుకొచ్చారు. మూవీ విషయానికి వస్తే.. ఈ చిత్రం భారత పురాణాల ఆధారంగా రూపొందుతున్న ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్. 'మన పురాణాల ప్రకారం మొత్తం 14 లోకాలు ఉన్నాయని చెబుతారు. యమలోకం, పాతాళం, స్వర్గం వంటి వాటి వరకు సినిమాల్లో చాలామంది చూపించారు. కానీ 'విశ్వంభర'లో ఆ 14 లోకాలకు మూలమైన 'సత్యలోకాన్ని' చూపించబోతున్నాం అని ఇటీవల దర్శకుడు చెప్పుకొచ్చారు. ఈ కథలో కథానాయకుడు ఆ లోకానికి ఎలా వెళ్తాడు? అక్కడి నుంచి కథానాయికను భూమిపైకి ఎలా తీసుకొస్తాడు? అన్న అంశం చుట్టూ సినిమా ఉంటుందని చెప్పాడు. ఇది ఒక రకమైన మిస్టిక్ యాత్రగా ఉంటుందని సమాచారం. ఈ సినిమా కోసం భారీ బడ్జెట్‌తో అద్భుతమైన సెట్స్ వేసి చిత్రీకరణ జరుపుతున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. ప్రతీ సన్నివేశం గొప్ప విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడి ఉండేలా డిజైన్ చేస్తున్నారు. అందుకే ఇది చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత విజువల్‌గా రిచ్ సినిమా అవుతుందని భావిస్తున్నారు.

## కార్మికుల వేతన పెంపునకు

# నిర్మాతలు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్:** సినీ కార్మికులకు 22.5 శాతం వేతన పెంపునకు అంగీకారం కుదిరింది. కార్మికశాఖ వద్ద జరిగిన చర్చలు ముగిసిన అనంతరం నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులు మీడియాతో మాట్లాడారు. నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ.. "గత 18 రోజుల నుంచి షూటింగ్స్ ఆగాయి. ఫెడరేషన్, నిర్మాతల మధ్య ఉన్న సమస్యలకు ఫిల్మ్ ఛాంబర్ ద్వారా పరిష్కారం చూపాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉన్నతాధికారులు, ఎఫ్‌డీసీ, కార్మికశాఖకు సూచించారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. అటు నిర్మాతల ఇబ్బందులను ఫెడరేషన్ వాళ్లు, ఫెడరేషన్ సమస్యలను నిర్మాతలు అర్థం చేసుకున్నారు" అని దిల్ రాజు పేర్కొన్నారు. కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ.. "ఈ నెల 4 నుంచి సినీ కార్మికులు సమ్మెకు దిగారు. 30 శాతం వేతనం పెంచాలని కార్మికులు కోరారు. దీనిపై ఫెడరేషన్, ఛాంబర్ మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. అక్కడ పరిష్కారం లభించకపోవడంతో కార్మికశాఖ వద్దకు వచ్చారు. కార్మికుల విషయంలో నిర్మాతలు నాలుగు షరతులు పెట్టారు. నేడు ఇరు పక్షాల మధ్య ఒప్పందం కుదిరింది. 22.5 శాతం వేతన పెంపునకు అంగీకరించారు. రూ.2 వేలలోపు వేతనాలు ఉన్న వారికి తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 2.5 శాతం, మూడో ఏడాది 5 శాతం, రూ.2 వేల నుంచి రూ.5 వేలు ఉన్నవారికి తొలి ఏడాది 7.5 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంచనున్నారు" అని తెలిపారు. "రేపట్నుంచి (శుక్రవారం) సినీ కార్మికులు షూటింగ్‌లకు హాజరవుతారు. పర్సంటేజీ విషయంలో బాధగా ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం తప్పట్లేదు. సినీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎంకు ధన్యవాదాలు" అని ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు.

# విశ్వంభర వాయిదాతో అనిల్‌లో ఆనందం

మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న విశ్వంభర సినిమా రిలీజ్ డేట్ వాయిదా పడడంతో అనిల్ రావిపూడికి కలసి వచ్చిందన అంటున్నారు. 2026 సమ్మర్ లో దీన్ని రిలీజ్ చేస్తున్నామన్నారు. వీఎఫ్ ఎక్స్ భారీగా ఉందని.. అందుకే డిలే అవుతుందన్నారు. అనిల్ రావిపూడితో తీస్తున్న మెగా 157 మూవీ తర్వాతనే ఇది రాబోతోంది. మొన్నటి వరకు దానికంటే ముందే వస్తుందనే ప్రచారం ఉండేది. ఇప్పుడు రాకపోవడంతో అనిల్ రావిపూడికి పండగే. ఎందుకంటే తన సినిమా ముందే విడుదలవుతుందని భావిస్తున్నారు. ఆయన సినిమా వచ్చే సంక్రాంతికి ప్లాన్ చేస్తున్నారు. ఎందుకంటే తన సినిమా కంటే ముందు విశ్వంభర వచ్చి పెద్ద హిట్ అయి ఉంటే ఆ ప్రెషర్ అంతా అనిల్ మీద ఉండేది. విశ్వంభర కంటే అనిల్ సినిమా పెద్ద హిట్ కావాలనే ఒత్తిడి ఉండేది. కచ్చితంగా మెగా 157తో పెద్ద హిట్ ఇవ్వాలని మెగా ఫ్యాన్స్ నుంచి ఒత్తిడి వచ్చేది. ఎలా చూసినా అనిల్ కు ఇబ్బందే. ఇప్పుడు విశ్వంభర తన సినిమా తర్వాత వస్తోంది కాబట్టి ఎలాంటి టెన్షన్ లేకుండా తన సినిమాను రిలీజ్ చేసుకోవచ్చు. అనిల్ సినిమా ఏ మాత్రం హిట్ అయినా అది విశ్వంభరకు కలిసొస్తుంది. విశ్వంభర మార్కెట్ ఇంకా పెరుగుతుంది. కాబట్టి అనిల్ కు ప్రశంసలే తప్ప విమర్శలు రావన్నమాట.



## మెగాస్టార్ చిరంజీవి

# నాకు దేవుడితో సమానం

### ఫిలిం క్రిటిక్, ప్రొడ్యూసర్ సురేష్ కొండేటి



**ఫిలింనగర్ ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి (ఆగస్టు 21) :** కథానాయకుడు చిరంజీవి నాకు దేవుడితో సమానం. ఆయనపై నాకున్న అభిమానాన్ని చాటి చెప్పే చిత్రమే... 'వీరాభిమాని'. చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఏపీ, తెలంగాణలోని 70 థియేటర్లలో ఈ సినిమాని ఉచితంగా ప్రదర్శిస్తున్నాం" అన్నారు సురేశ్ కొండేటి. ఆయన ప్రధాన పాత్రధారిగా... రాంబాబు దోమకొండ తెరకెక్కించిన చిత్రమే 'వీరాభిమాని'. ఎస్.కె.రెహ్మాన్, కంద సాంబశివరావు నిర్మాతలు. డ్రమ్స్ రాము పాటలు, మణిశర్మ నేపథ్య సంగీతం అందించారు. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 22న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఇటీవల ప్రత్యేక ప్రదర్శనని నిర్వహించారు. అనంతరం చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. సురేశ్ కొండేటి మాట్లాడుతూ "ఈ నెల 22న మెగాభిమానులంతా ఈ సినిమాని చూసి ఆస్వాదించాల"ని కోరారు. ఒక అభిమాని తన హీరో కోసం ఎంతవరకు వెళ్లగలడనే అంశం ఇందులో ఆసక్తికరంగా ఉంటుందని చెప్పారు దర్శకుడు.

# నా పిల్లలు అలా పేరు తెచ్చుకోవాలని కోరుకోలేదు: మోహన్‌లాల్



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్ లాల్ కుమార్తె విస్మయ 'తుడక్కమ్' చిత్రంతో వెండితెరకు పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. ఆమె అరంగేట్రం గురించి మోహన్‌లాల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సినీ పరిశ్రమలో రాణించాలంటే కుటుంబ నేపథ్యం ఒక్కటే ఉంటే సరిపోదని ప్రతిభ కూడా ముఖ్యమన్నారు. ఇప్పటికే మోహ న్‌లాల్ కుమారుడు ప్రణవ్ 2018లోనే సినీరంగంలోకి ప్రవేశించారు. ఇప్పుడు ఈ అగ్రనటుడి కుమార్తె విస్మయ 'తుడక్కమ్'తో ప్రేక్షకులను పలకరించనున్నారు. పిల్లలు ఇండస్ట్రీలోకి రావడం గురించి మోహన్‌లాల్ మాట్లాడా రు. "విస్మయకు నటనపై ఆసక్తి ఉందని ఎప్పుడో చెప్పింది. కానీ, నా పిల్లలు కాబట్టి గొప్పవారు కావాలని నేనెప్పుడూ అనుకోలేదు. వారి ప్రతిభతో గుర్తింపు తెచ్చుకుంటే అది వారి భవిష్యత్తుకే మంచిది. వాళ్లు ఇండస్ట్రీకి వస్తామన్న ప్పుడు కూడా ఇదే మాట చెప్పాను" అని తెలిపారు. ఇక అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ ఎన్నిక కావడంపై మోహన్‌లాల్ హర్షం వ్యక్తం చేశారు.

# అనిల్, చిరు కాంబినేషన్ మూవీ

## మన శివశంకర వరప్రసాద్ గారు..!

### ఈ పండక్కి వస్తున్నారనే ట్యాగ్

అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓసినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. లేడి సూపర్ స్టార్ నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అనిల్ రావిపూడి సినిమా కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ శుక్రవారం మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఈ సినిమా టైటిల్ ను రిలీజ్ చేయనున్నారు. ఇందుకోసం భారీ ఈవెంట్ ప్లాన్ చేసింది యూనిట్. హైదరాబాద్ లోని ప్రసాద్ ఐమాక్స్ బిగ్ స్క్రీన్ లో ఉదయం 10 గంటలకు భారీ ఈవెంట్ నిర్వహించనున్నారు. అలాగే ఉదయం 11.25 గంటలకు మెగా 157 టైటిల్ గ్లిమ్స్ ను కూడా రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమామాకు 'మన శివ శంకర వరప్రసాద్ గారు' టైటిల్ తో 'ఈ పండక్కి వస్తున్నారు' ట్యాగ్ లైన్ ను ఫిక్స్ చేసారు. ఈ చిత్రంలో డ్రిల్ మాస్టర్ గా కనిపిస్తున్న మెగా స్టార్ చిరు తన వింటేజ్ కామెడీ టైమింగ్ తో అదరగొట్టబోతున్నాడని సమాచారం. ఈ సినిమాతో వింటేజ్ చిరు మరోసారి ప్రేక్షకులను అలరిస్తాడని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. మాస్ మ్యూజిక్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న చిరు అనిల్ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని ఇదివరకే ప్రకటించారు మేకర్స్. భారీ అంచనాల మధ్య వస్తున్న చిరు అనిల్ కాంబో ఎంతటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com